మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం SUNDAY 21-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 354 Issue: 354

22 జూన్ 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:46 సూర్యాస్తమయం - సా. 6:49 తిథి అష్టమి మ. 3:44 వరకు తరువాత నవమి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం ఉత్తర ఫల్గుని(ఉత్తర) ఉ. 10:20 వరకు తరువాత హస్త యోగం వ్యతిపాత ఉ. 10:27 వరకు కరణం బవ మ. 3:44 వరకు భాలవ తె. 4:060 వరకు వర్జ్యం రా. 7:18 నుండి రా. 9:00 వరకు దుర్ముహూర్తం మ. 12:44 నుండి మ. 1:36 వరకు మ. 3:20 నుండి సా. 4:12 వరకు రాహుకాలం ఉ. 7:24 నుండి ఉ. 9:02 వరకు యమగండం ఉ. 10:40 నుండి మ. 12:18 వరకు గుళికాకాలం మ. 1:55 నుండి మ. 3:33 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:10 నుండి తె. 4:58 వరకు అమృత ఘడియలు తె. 5:30 నుండి ఉ. 7:12 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:52 నుండి మ. 12:44 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial




## ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్ విజేతగా భారత మహిళలు

ఆసియా క్రీడలకు ముందే భారత మహిళల హాకీ జట్టు అదరగొట్టింది. ప్రతిష్ఠాత్మక ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్‌లో తమకు తిరుగులేదని చాటుతూ ట్రోఫీని కొల్లగొట్టింది. ఆదివారం జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన భారత్ రెండోసారి కప్‌ను ఒడిసిపట్టింది. టైటిల్ పోరులో నవ్‌నీత్ కౌర్, సునేలిటా టొప్పోలు చెరొక గోల్ కొట్టగా.. 2-0తో కివీస్ మట్టికరిచింది. ఆక్లాండ్ వేదికగా జరిగిన ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్‌లో భారత జట్టు టైటిల్ పట్టేసింది. ఏకపక్షంగా సాగిన ఫైనల్లో న్యూజిలాండ్‌ను టీమిండియా 2-0తో ఓడించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో నవనీత్ కౌర్ 4వ నిమిషంలోనే తొలి గోల్ కొట్టగా భారత్ 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఖాతా తెరిచేందుకు కివీస్ జట్టు ఎంతగానో ప్రయత్నించినా భారత డిఫెండర్లు ఏమాత్రం అవకాశమివ్వలేదు. ప్రత్యర్థికి షాకిస్తూ సునేలిటా టొప్పో 15వ నిమిషంలో గోల్‌తో టీమిండియా స్పష్టమైన ఆధిపత్యం చెలాయించింది. ఫైనల్లో అద్భుతంగా రాణించిన ఫార్వర్డ్ లల్రేమ్సియామి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ఎంపికైంది. టోర్నీ ఆసాంతం గొప్పగా ఆడిన దీపిక ఆరు గోల్స్‌తో అమెరికా ప్లేయర్ అష్లే సెస్సాతో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును పంచుకుంది.



## ముక్కోణపు వన్డే సిరీస్ టీమిండియాదే

ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత-ఏ జట్టు జయభేరి మోగించింది. దంబుల్లా వేదికగా జరిగిన ఫైనల్లో శ్రీలంక ఏ జట్టును టీమిండియా చిత్తు చేసింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(94) తుఫాన్ ఇన్నింగ్స్‌తో కుదేలైన లంక.. గట్టిగానే పోరాడింది. వనుజ సహన్(62), సమరవిక్రమ (52)లు అర్ధ శతకాలతో రాణించినా సరిపోలేదు. యశ్ ఠాకూర్(3-45), అనుకుల్ రాయ్(39, 2-42) ఆల్‌రౌండ్ షో తోడవ్వగా 66 పరుగుల తేడాతో టీమిండియా విజేతగా నిలిచింది. మూడు దేశాల వన్డే సిరీస్ ఫైనల్లో టీమిండియా ఏ ధాటికి శ్రీలంక ఏ జట్టు చేతులెత్తేసింది.

378 పరుగుల ఛేదనను ధాటిగా ఆరంభించాలనుకున్న లంకను యశ్ ఠాకూర్(3-45) ఆదిలోనే దెబ్బకొట్టాడు. ఠాకూర్ విజృంభణతో 75కే మూడు వికెట్లు కోల్పోయిన లంకను సమరవిక్రమ(52), రవిందు ఫెర్నాండో(19) అదుకున్నారు. ఈ జోడీని తిలక్ వర్మ విడదీయగా.. సహన్ అరాచ్చిగే(38), వనుజ సహన్(62)లు కాసేపు ప్రతిఘటించారు. అయితే.. విప్రజ్ నిగమ్(), అనుకుల్ రాయ్(39, 2-42) ఆల్‌రౌండ్ షో తోడవ్వగా 66 పరుగుల తేడాతో టీమిండియా విజేతగా నిలిచింది ఫైనల్లో భారత ఏ జట్టు మొదట కొండంత స్కోర్ కొట్టింది. శ్రీలంక బౌలర్లను భయపెడుతూ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(94) కేవలం 11 బంతుల్లోనే అర్ధ శతకంతో చెలరేగాడు. పవర్ ప్లేలోనే వైభవ్ ఊచకోతతో అలవోకగా టీమిండియా తరువాయి 2 వ పేజీలో...

## అమోనియా గ్యాస్ లీకై ఏడుగురి మృతి

### తమిళనాడులో ఘోర ప్రమాదం.. తమిళనాడు సీఫుడ్ కంపెనీలో ఘటన



తమిళనాడులో ఘోర పారిశ్రామిక ప్రమాదం చోటు చేసుకుంది. తిరువళ్లూరు జిల్లాలోని ఓ ప్రైవేట్ సీఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలో అమోనియా గ్యాస్ లీక్ కావడంతో ఏడుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆరుగురు మహిళలు ఉన్నారు.

తిరువళ్లూర్/చెన్నై: ఈ దుర్ఘటనలో మరో 74 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, తిరువళ్లూరు జిల్లా పెరియపాళయం సమీపంలోని కన్నిగైపెట్టై గ్రామంలో ఉన్న రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో ఈ ప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీలో అమోనియా గ్యాస్ ఒక్కసారిగా లీక్ కావడంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు ఊపిరాడక కుప్పకూలిపోయారు. బాధితుల్లో ఎక్కువ మంది ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారేనని తెలుస్తోంది. వీరిలో తరువాయి 2 వ పేజీలో...



## యోగా.. మానవ స్ఫూర్తికి నిదర్శనం:మోదీ

యోగా ప్రపంచం మొత్తాన్ని ఒకే వేదికపైకి తీసుకొచ్చిందని ప్రధాని మోదీ అన్నారు. 'వయసుతోపాటు ఆరోగ్యానికి యోగా' ఇతివృత్తంతో కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో 35 వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాతో ప్రపంచ వ్యాప్తంగా ఒకరికొకరు కలిసినట్లయిందన్నారు.

కోల్‌కతాలో వేర్వేరు చోట్ల 10 లక్షల మంది యోగాసనాలు వేసేలా ఏర్పాట్లు చేశారు. 'జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా యోగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ యోగా కార్యక్రమాలతో దేశం మొత్తం చైతన్యంతో నిండిపోయింది. ఇది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు. కేవలం తరువాయి 2 వ పేజీలో...



## నీట్ యూజీ రీ ఎగ్జామ్ ప్రశాంతం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఎంతో ఉత్కంఠ రేపిన నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామ్ ప్రశాంతమైన వాతావరణంలో ముగిసింది. 551 నగరాలు, 14 అంతర్జాతీయ కేంద్రాలలో ఈ పరీక్షను ఎన్టీయే అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహించింది. దేశవ్యాప్తంగా ఎంతో ఉత్కంఠ రేపిన నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామ్ ప్రశాంతమైన వాతావరణంలో ముగిసింది. 551 నగరాలు, 14 అంతర్జాతీయ కేంద్రాలలో ఈ పరీక్షను ఎన్టీయే తరువాయి 2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,137 |
| వెండి (కిలో): | రూ.2,75,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,248 |

## ఈ కష్టాలన్నీ ఏడాదే


### వచ్చేది మన సర్కారే... కాంగ్రెస్ హామీలు గాయబ్

### అభివృద్ధి పేర లూటీలు.. 'బస్తీ బాట'లో కేటీఆర్



అలవి కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను "గుంపు మేస్త్రి" అని చెప్పుకుంటూ నిర్మాణాలు చేయాల్సింది పోయి ప్రజల ఇండ్లను కూల్చే పనిలో పడ్డాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని హనుమాన్ నగర్‌లో నిర్వహించిన "బస్తీ బాట" కార్యక్రమంలో పాల్గొని స్థానిక ప్రజల సమస్యలను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు.

హైదరాబాద్, జూన్ 21 (ఈవార్తలు): దాదాపు 60 సంవత్సరా లుగా హనుమాన్ నగర్ బస్తీలో నివసిస్తున్న తమను బలవంతంగా తరలించి, ఆ భూములను ప్రభుత్వం అమ్మేసుకోవాలని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని బస్తీవాసులు కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన పట్టాలను కూడా రద్దు చేసి, తమ భూములను లాక్కోవాలని ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో హనుమాన్ నగర్ ప్రజల జోలికి ఎవరూ రాలేదని తెలిపారు. ఈ ప్రభుత్వానికి సగం కాలం పూర్తయింది. కానీ-2 వ పేజీలో...



## టీజీ20 సంబురం షురూ

### హాజరైన విజయ్ దేవరకొండ.. ఉప్పల్ స్టేడియంలో ప్రారంభమైన పోటీలు

### తమన్ ప్రదర్శనతో హోరెత్తిన స్టేడియం.. లీగ్‌కు సంపూర్ణ మద్దతు: భట్టి విక్రమార్క

తెలంగాణ క్రీడారంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీజీ20 లీగ్ ఉప్పల్ స్టేడియంలో అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్రంలోని గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో దాగి ఉన్న క్రికెట్ ప్రతిభను వెలికితీసి వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ లీగ్‌ను ప్రారంభించారు.

హైదరాబాద్, జూన్ 21 (ఈవార్తలు): ప్రారంభోత్సవకార్యక్ర మానికి లీగ్ బ్రాండ్ అంబాసిడర్, ప్రముఖ సినీ నటుడు విజయ్ దేవరకొండ హాజరై సందడి చేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్. థమన్ తన లైవ్ ప్రదర్శనతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, హైదరాబాద్,-2 వ పేజీలో...



## నేటి నుంచి భారీ వర్షాలు


### 40-50 కి.మీ. వేగంతో ఈదురు గాలులు

### ఉరుములు, మెరుపులతో కూడిన వానలు


### పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్, జూన్ 21 (ఈవార్తలు): రాష్ట్రంలోని సోమవారం నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. గంటకు 40-50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని అంచనా వేసింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



గుండెపోటు (హార్ట్ అటాక్), పక్షవాతం (స్ట్రోక్) వంటి ప్రాణాంతక గుండె సంబంధిత వ్యాధులు ఎలాంటి హెచ్చరికలు లేకుండానే వస్తాయని చాలామంది భావిస్తుంటారు. అయితే, తాజా పరిశోధన ప్రకారం.. 99 శాతం మందికి ముందుగానే నాలుగు ప్రధాన ప్రమాద కారకాలు ఉన్నట్లు గుర్తించారు. అధిక రక్తపోటు (హైపర్‌టెన్షన్), అధిక కొలెస్ట్రాల్, రక్తంలో అధిక చక్కెర స్థాయిలు (హై బ్లడ్ షుగర్), పొగాకు వినియోగం (ప్రస్తుతం లేదా గతంలో) వల్ల హార్ట్ అటాక్, స్ట్రోక్ వస్తుందని తేలింది.



## సైబర్ బాధితులకు రూ. 45.21 కోట్లు


### లోక్‌అదాలత్‌తో 6,303 మందికి రీఫండ్

హైదరాబాద్, జూన్ 21 (ఈవార్తలు): ఆన్‌లైన్ కేటుగాళ్ల చేతిలో చిక్కి తీవ్రంగా నష్టపోతున్న సైబర్ నేరాల బాధితులకు తెలంగాణ పోలీసులు, న్యాయ సేవా అధికార సంస్థలు బిగ్ రిలీఫ్ ఇచ్చాయి. తరువాయి 2 వ పేజీలో...

## చెప్తే వింటలేరు.. ఈ సారి గట్టిగా!

### గతం కంటే తీవ్రంగా దాడులు


### ఇరాన్‌కు మరోసారి ట్రంప్ వార్నింగ్



ఇరాన్‌కు మరోసారి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. చర్చలు విఫలమైతే మళ్లీ దాడులు చేస్తామని.. గత వారం కంటే ఈసారి దాడులు తీవ్రంగా ఉంటాయంటూ హెచ్చరించారు. డీల్ కుదరకపోతే హర్మూజ్‌ను ఆధీనంలోకి తీసుకుంటామన్నారు.

వాషింగ్టన్: హర్మూజ్‌ను క్లోజ్ చేస్తే మీకు దేశం లేకుండా చేస్తామన్న ట్రంప్.. హిజ్బొల్లాను అదుపు చేయకపోతే ఇరాన్‌పై మళ్లీ దాడులు చేస్తామన్నారు. లెబనాన్‌లో సమస్యలు సృష్టిస్తున్న ప్రాక్సీలను ఇరాన్ వెంటనే నియంత్రించాలని తన 'ట్రూత్ సోషల్' పోస్ట్‌లో రాసుకొచ్చారు. 60 రోజుల్లో ఇరాన్‌తో ఒప్పందం కుదరకపోతే హర్మూజ్‌లో టోల్స్ వసూలు చేస్తామన్నారు. మరో వైపు, పశ్చిమ తరువాయి 2 వ పేజీలో...

## మావో అగ్రనేత 'గణపతి' సోదరుడి మృతి



### అన్నకు ఆఖరి వీడ్కోలు ఇవ్వడానికి గణపతి వస్తాడా?

### బీర్పూర్‌లో చర్చనీయాంశమైన ప్రశ్న

బీర్పూర్/జగిత్యాల, జూన్ 21 (ఈవార్తలు-(కాలగిరి శ్రీనివాసరెడ్డి): జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల కేంద్రానికి చెందిన ముప్పాల నర్సింగరావు (81) ఆదివారం మధ్యాహ్నం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మరణంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అయితే ఈ మరణ వార్తతో మరో ప్రశ్న బీర్పూర్ గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. అదే... మాజీ మావోయిస్టు అగ్రనేత ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి తన అన్నకు చివరి వీడ్కోలు ఇవ్వడానికి వస్తాడా? ముప్పాల నర్సింగరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హ్యాండ్లూమ్స్ శాఖ రాష్ట్ర డైరెక్టర్‌గా సేవలందించి తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

22.6.2026

మేషం: మిత్రులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో అధికారులతో సమస్యలుంటాయి. కొన్ని పనులలో శ్రమ తప్పదు. ముఖ్యమైన వ్యవహారాలలో ప్రతిబంధకాలు తప్పవు. ఇంటాబయట ఊహించని వివాదాలు కలుగుతాయి. వృత్తి, వ్యాపారాలు నిరాశ కలిగిస్తాయి.

వృషభం: ఉద్యోగమున సమస్యలు నుంచి బయటపడతారు. పనుల్లో అవాంతరాలు తొలగుతాయి. వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. దీర్ఘకాలిక వివాదాలు పరిష్కరించుకుంటారు. కుటుంబ సభ్యులతో దైవదర్శనాలు చేసుకుంటారు. నూతన వాహనయోగం ఉన్నది.

మిధునం: విద్యార్థులకు పరీక్ష ఫలితాలు కొంత నిరాశ కలిగిస్తాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. బంధువులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. వృధా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. వ్యాపార, ఉద్యోగాలలో చికాకులు తప్పవు. దైవ చింతన పెరుగుతుంది.

కర్కాటకం: సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో సమస్యలు అధిగమిస్తారు. మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశములు దక్కుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

సింహం: చేపట్టిన పనుల్లో అవాంతరాలు తొలగుతాయి. నూతన వస్త్ర, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. స్థిరాస్తి క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. నూతన వ్యక్తుల పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. వ్యాపార విస్తరణకు అవకాశములు అందుతాయి.

కన్య: స్వల్ప అనారోగ్య సమస్యలు ఇబ్బంది కలిగిస్తాయి. చేపట్టిన పనులు ముందుకు సాగక చికాకు పెరుగుతుంది. సన్నిహితులతో దైవదర్శనాలు చేసుకుంటారు. కుటుంబ సభ్యులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. వృత్తి, వ్యాపారాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

తుల: మొండి బాకీలు వసూలవుతాయి. దాయదులతో భూవివాదాలు కొలిక్కి వస్తాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ముఖ్యమైన పనులు అనుకున్న విధంగా పూర్తిచేస్తారు. బంధు మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. వ్యాపార,ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహం పొందుతారు.

వృశ్చికం: బంధువులతో విభేదాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు కొంత మందకొడిగా సాగుతాయి. ఉద్యోగమున నిరాశ తప్పదు చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు కలుగుతాయి. మిత్రుల నుంచి కొన్ని విషయాలలో ఒత్తిడులు తప్పవు. ఉదర సంభంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

ధనస్సు: కొన్ని వ్యవహారాలలో ఇతరులతో అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు చేస్తారు. ఆర్థిక ఇబ్బందుల వలన మానసిక సమస్యలు కలుగుతాయి. సోదరులతో విభేదాలు కలుగుతాయి. వృత్తి, వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం మంచిది కాదు.

మకరం: ముఖ్యమైన పనులలో ఆలోచించి ముందుకు సాగడం మంచిది. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. నిరుద్యోగుల ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ వాతవరణం ఉత్సాహంగా ఉంటుంది.

కుంభం: సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు వాయిదా పడతాయి. చేపట్టిన పనుల్లో ప్రతిబంధకాలు తొలగుతాయి. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. వ్యాపారాలు కొంత గందరగోళంగా ఉంటాయి. ఉద్యోగాలలో ఇబ్బందులు తొలగుతాయి.

మీనం: ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ వహించాలి. ఉద్యోగ యత్నాలలో ఆటంకాలు తప్పవు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఊహించని చికాకులు కలుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఇంటాబయటా కొందరి ప్రవర్తన చికాకు కలిగిస్తుంది. దైవదర్శనాలు చేసుకుంటారు.

# సైబర్ బాధితులకు రూ. 45.21 కోట్లు

మొదటి పేజీ తరువాయి

ప్రత్యేకంగా నిర్వహించిన లోక్అదాలత్ వేదికగా సైబర్ మోసాలకు గురైన బాధితులకు భారీ ఎత్తున నగదును రీఫండ్ చేసినట్లు పోలీస్ ఉన్నతాధికారులు అధికారికంగా వెల్లడించారు. ఈ ప్రత్యేక డ్రైవ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6303 మంది సైబర్ మోసం బాధితులకు ఏకంగా రూ. 45.21 కోట్ల రూపాయలను విజయవంతంగా వారి ఖాతాల్లోకి రిఫండ్ చేయించారు. కోల్పోయిన సొమ్ము మళ్లీ చేతికి రావడంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఈ రికవరీ ప్రక్రియలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ అత్యంత కీలకపాత్ర పోషించి ముందంజలో నిలిచింది. ఒక్క సైబరాబాద్ పరిధిలోనే 2,232 మంది బాధితులకు చెందిన రూ. 21.91 కోట్లు రికవరీ చేసి వెనక్కి ఇప్పించారు. అదేవిధంగా.. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నేరుగా తన పరిధిలోని 77 మంది బాధితులకు సంబంధించిన రూ. 6.83 కోట్లను రికవరీ చేసింది. జిల్లాల వారీగా పరిశీలిస్తే.. మల్కాజిగిరి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు సైబర్ నేరగాళ్ల బ్యాంక్ ఖాతాల నుంచి సొమ్మును రికవరీ చేయడంలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచాయి. రాష్ట్రంలో సైబర్ నేరాల కట్టడికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రారంభమైన నాటి నుండి నేటివరకు అద్భుతమైన ఫలితాలను సాధించింది. ఈ బ్యూరో వ్యవస్థ ఏర్పాటైనప్పటి నుండి ఇప్పటివరకు మొత్తం 59,953 మంది బాధితులకు రూ. 445.41 కోట్ల రూపాయలను రిఫండ్ చేయించి రికార్డు సృష్టించింది. ప్రస్తుత 2026 సంవత్సరంలోనే.. జూన్ 20వ తేదీ వరకు సైబర్ మోసగాళ్ల ముఠాల నుండి రూ. 70.07 కోట్లను పోలీసులు రికవరీ చేసి ఫ్రీజ్ చేయించారు. సైబర్ నేరగాళ్లు ఎక్కువగా వాడుతున్న యూపీఐ మోసాలు, నకిలీ ఇన్వెస్ట్మెంట్ స్కామ్‌లు, ఇంపర్సనేషన్ స్కామ్‌ల బాధితులకు పోలీసులు ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో వేగంగా న్యాయం చేకూర్చారు. ఈ సందర్భంగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు ప్రజలకు ఒక ముఖ్యమైన సాంకేతిక విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్ లేదా సైబర్ మోసం జరిగిన వెంటనే బాధితులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే 1930 అనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి తమ ఫిర్యాదును నమోదు చేయాలని కోరారు. మోసం జరిగిన మొదటి గంటను వైద్య పరిభాషలో లాగే సైబర్ క్రైమ్‌లోనూ గోల్డెన్ అవర్‌గా పరిగణిస్తారని వివరించారు. ఈ గోల్డెన్ అవర్‌లో గనుక బాధితులు అప్రమత్తమై 1930 నంబర్‌కు ఫిర్యాదు ఇస్తే.. నేరగాళ్లు ఆ సొమ్మును వేరే అకౌంట్లలోకి మార్చకముందే వారి బ్యాంక్ ఖాతాలను పోలీసులు సులభంగా ఫ్రీజ్ చేయగలుగుతారు. దీనివల్ల బాధితులకు తమ డబ్బు తిరిగి వచ్చే అవకాశాలు అత్యధికంగా ఉంటాయని తెలంగాణ పోలీసులు స్పష్టం చేశారు.

# మావో అగ్రనేత 'గణపతి' సోదరుడి మృతి

మొదటి పేజీ తరువాయి

పదవీ విరమణ పొందారు. అనంతరం హైదరాబాద్‌లో నివసిస్తూ ప్రశాంత జీవితం గడుపుతున్నారు. ఆయన మరణ వార్త తెలియగానే బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు హైదరాబాద్‌కు తరలివెళ్తున్నారు. అయితే నర్సింగరావు వ్యక్తిగత జీవితాన్ని మించి, ఆయన కుటుంబ నేపథ్యం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

ఎందుకంటే ఆయన సోదరుడు ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి ఒకప్పుడు దేశవ్యాప్తంగా మావోయిస్టు ఉద్యమానికి ప్రధాన నాయకత్వం వహించిన వ్యక్తి. దశాబ్దాల పాటు రహస్య జీవితాన్ని గడిపిన గణపతి, రెండు దశాబ్దాలకు పైగా మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. పీపుల్స్ వార్ నుంచి సీపీఐ (మావోయిస్టు) వరకు ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. గత కొన్నేళ్లుగా మావోయిస్టు ఉద్యమం తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంది.

పలువురు అగ్రనేతలు మరణించగా, మరికొందరు లొంగిపోయారు. అయినప్పటికీ గణపతి మాత్రం ఇప్పటివరకు ప్రభుత్వానికి లొంగలేదు. ఆయన ఎక్కడ ఉన్నారన్నది ఇప్పటికీ స్పష్టంగా తెలియని పరిస్థితి ఉంది. ఇలాంటి నేపథ్యంలో తన అన్న మరణ వార్త గణపతికి చేరిందా? చేరితే ఆయన చివరి చూపు కోసం వస్తారా? లేక తన జీవితాన్ని ఆవరించిన రహస్య జీవితం మరోసారి కుటుంబ బంధాలపై పైచేయి సాధిస్తుందా? అన్న ప్రశ్నలు గ్రామస్థుల్లో చర్చకు దారితీస్తున్నాయి. ఒకవైపు ప్రభుత్వ ఉన్నతాధికారిగా సేవలందించిన అన్న... మరోవైపు విప్లవ మార్గాన్ని ఎంచుకుని దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉన్న తమ్ముడు.

జీవితం వారిద్దరినీ వేర్వేరు దారుల్లో నడిపించినా, రక్త సంబంధం మాత్రం ఒకటే. ఇప్పుడు ఆ బంధాన్ని గుర్తుచేస్తూ నర్సింగరావు మరణం బీర్పూర్ గ్రామ ప్రజల్లో భావోద్వేగాలను రేకెత్తిస్తోంది. అన్నకు చివరి వీడ్కోలు చెప్పేందుకు గణపతి ప్రత్యక్షమవుతారా లేదా అన్నది ఇప్పటికీ సమాధానం లేని ప్రశ్నగానే మిగిలింది. కానీ ఈ మరణం మరోసారి ఒక కుటుంబ కథను, ఒక ఉద్యమ నాయకుడి జీవితంలోని మానవీయ కోణాన్ని ప్రజల ముందుకు తీసుకొచ్చిందనేది మాత్రం వాస్తవం.



# యోగా.. మానవ స్ఫూర్తికి నిదర్శనం: మోదీ

మొదటి పేజీ తరువాయి

కొన్ని వయసుల వారికే పరిమితం కాలేదు. ఇది మానవ స్ఫూర్తికి నిదర్శనం. ప్రపంచ వ్యాప్తంగా ఒకరికొకరిని చేరువ చేస్తుంది. అందర్నీ ఏకం చేస్తుంది. జీవనం మరింత సమతులంగా సాగేలా చేస్తుంది. ఏం చేయాలో, ఏం చేయకూడదో నేర్పుతుంది. శక్తిమంతంగా, సౌకర్యవంతంగా ఉంచుతుంది. వ్యాధుల నుంచి దూరంగా ఉంచుతుంది. 20ఏళ్ల కంటే 40 ఏళ్ల వయసులో మరింత దృఢంగా ఉండాలి. ఒత్తిడి రహిత జీవితానికి యోగా దోహదం చేస్తుంది. మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయుక్తం. అందుకే యోగాను కొన్ని సందర్భాలకే పరిమితం చేయకుండా.. నిత్యం సాధన చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. మరింత మెరుగైన ప్రపంచం కోసం యోగా అవసరం' అని మోదీ పేర్కొన్నారు.



# ఈ కష్టాలన్నీ ఏడాదే

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో లూటీలు జరుగుతున్నాయి.. కానీ హైదరాబాద్ నగరంలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదని అన్నారు. హనుమాన్ నగర్ బస్తీ మూసీకి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. స్థానిక ప్రజలు ఐక్యంగా ఉంటే ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వానికి ప్రజల సమస్యలను అర్థం చేసుకునే తెలివితేటలు కూడా లేవని కేటీఆర్ అన్నారు. ఇంకో సంవత్సరం ఓపిక పట్టండి... మళ్లీ రాబోయేది మన ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. మీ అందరికీ పట్టాలు ఇచ్చే బాధ్యత మాదని హామీ ఇచ్చారు. ఈ ఒక్క సంవత్సరం పాటు మీ ఇండ్లను మీరే కాపాడుకోండి... కాంగ్రెస్ నాయకుల మాటలకు మోసపోవద్దని సూచించారు. పెద్దలకు ఒక నీతి.. పేదలకు మరో నీతి అన్నట్లుగా హైడ్రా వ్యవహరిస్తున్నదని కేటీఆర్ మండిపడ్డారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లి, ప్రస్తుతం స్థానిక ప్రజలను బెదిరింపులకు గురిచేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. మేమంతా మీకు అండగా ఉంటాం... ఎవ్వరూ భయపడకండని భరోసా ఇచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు గడిచినా ఎన్నికల హామీల్లో ఒక్కదాన్ని కూడా అమలు చేయలేదని తెలిపారు.

## నీట్ యూజీ రీ ఎగ్జామ్ ప్రశాంతం

మొదటి పేజీ తరువాయి

అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య నిర్వహించింది. మే 3న జరిగిన పరీక్షపై వచ్చిన లీకేజీ ఆరోపణల నేపథ్యంలో, ఈసారి ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఏఐ సర్వైలెన్స్, జామర్లు, సీసీటీవీ కెమెరాలతో పటిష్టమైన చర్యలు తీసుకున్నారు.



## అమోనియా గ్యాస్ లీకై ఏడుగురి మృతి

మొదటి పేజీ తరువాయి

చాలా మంది 24-25 ఏళ్ల వయసున్న యువతులే ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీపంలోని వేల్స్, వెంకటేశ్వర ఆసుపత్రులకు తరలించారు. వీరిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉండటంతో, మెరుగైన చికిత్స కోసం చెన్నైలోని స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం 11 మంది వెంటిలేటర్లపై ఉన్నారని, మరికొందరికి ఇంట్యూబేషన్ చేశామని వైద్యులు తెలిపారు. కోల్డ్ స్టోరేజ్ యూనిట్‌లోని వాల్వ్ ఫెయిల్ కావడం వల్లే గ్యాస్ లీక్ అయినట్లు ప్రాథమికంగా గుర్తించారు. సమాచారం అందుకున్న తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ ఎస్. కవిత ఘటనా స్థలాన్ని, ఆసుపత్రులను సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలపై, కంపెనీలో భద్రతా లోపాలపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు ఆమె వెల్లడించారు.

## ముక్కోణపు వన్డే సిరీస్ టీమిండియాదే

మొదటి పేజీ తరువాయి

నాలుగొందలు కొడుతుందని పించింది. కానీ, కెప్టెన్ తిలక్ వర్మ(67) మినహా ఎవరూ రాణించలేదు. .మిడిలార్డర్ వైఫల్యం, డెత్ ఓవర్లలో భారత ఆటగాళ్లను లంక పేసర్లు గొప్పగా కట్టడి చేశారు. కుమార్ కుషగ్ర(39), ఆఖర్లో అనుకుల్ రాయ్(39) మెరుపులతో భారత ఏ జట్టు 9 వికెట్ల నష్టానికి 377 పరుగులతో లంకకు సవాల్ విసిరింది.

# నేటి నుంచి భారీ వర్షాలు

మొదటి పేజీ తరువాయి

నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం నాడు ఆదిలాలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. బుధవారం నాడు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. అలాగే అన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# .. ఈ సారి గట్టిగా!

మొదటి పేజీ తరువాయి

ఆసియాలో నెలల తరబడి కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలికే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ దేశాల మధ్య స్విట్జర్లాండ్‌లోని బర్గెన్‌స్టాక్ రిసార్ట్‌లో కీలక చర్చలు ప్రారంభమయ్యాయి. ఇటీవల కుదిరిన చారిత్రాత్మక 'ఇస్లామాబాద్ అవగాహన ఒప్పందం' ఆధారంగా ఈ ఉన్నత స్థాయి దౌత్య సమావేశం జరుగుతోంది. కతార్, పాకిస్తాన్ దేశాలు మధ్యవర్తులుగా వ్యవహరిస్తుండగా, స్విస్ దౌత్యవేత్తలు ఈ వేదిక సిద్ధం చేశారు. రాబోయే 60 రోజుల్లో సమగ్ర అణు ఒప్పందాన్ని ఖరారు చేయడం, ప్రాంతీయ శాంతిని నెలకొల్పడమే లక్ష్యంగా ఇరు దేశాల ప్రతినిధులు ఈ చర్చల్లో పాలుపంచుకుంటున్నారు.

# టీజీ20 సంబురం షురూ

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన క్రికెటర్ల సంఖ్య చాలా తక్కువగా ఉందని, వీవీఎస్ లక్ష్మణ్ తర్వాత ఆ స్థాయిలో మరిన్ని ఆటగాళ్లు రావాల్సిన అవసరం ఉందన్నారు. టీజీ20 లీగ్ ద్వారా యువ ప్రతిభ వెలుగులోకి వచ్చి ఐపీఎల్‌తో పాటు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం టీజీ20 లీగ్‌కు పూర్తి మద్దతు ఇస్తుందని ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్నప్పటికీ అవకాశాలు లభించని యువతకు ఈ టోర్నమెంట్ గొప్ప వేదికగా నిలుస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, రాష్ట్రంలో ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భట్టి వెల్లడించారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి వారిని ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రారంభోత్సవం అనంతరం మ్యాచ్‌లు కూడా ప్రారంభమయ్యాయి. తెలంగాణ యువ క్రికెటర్లకు ఈ లీగ్ ఒక సువర్ణావకాశంగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. అయితే, లీగ్ నిర్వహణపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ, హెచ్‌సీఏ మాత్రం టోర్నీని విజయవంతంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపింది. క్రీడాభిమానులు, యువ ఆటగాళ్ల నుంచి టీజీ20కు విశేష స్పందన లభిస్తోంది.



# భద్రాచలం ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్చాలి

**సీఎం రేవంత్‌కు జాన్ వెస్లీ లేఖ**



భద్రాచలం, జూన్ 21 (ఈవార్తలు): నాలుగు రాష్ట్రాల సరిహద్దులోని పేదలు, ముఖ్యంగా గిరిజన (ఆదివాసీ) ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని.. సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. జూన్ 10న తేదీన తమ పార్టీ నాయకత్వంతో కలిసి భద్రాచలం ఆసుపత్రిని సందర్శించామని, ఆ సమయంలో మౌలిక, సిబ్బంది లోపాలను గమనించినట్టు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సరిహద్దుల్లోని దాదాపు 80 శాతం మంది ఆదివాసీలు ఈ ఆసుపత్రిపైనే ఆధారపడుతున్నారని, అయినా ఐటీడీఏ నిధులు దీనికి కేటాయించడం లేదని లేఖలో పేర్కొన్నారు. ఆసుపత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉందని జాన్ వెస్లీ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం 62 మంది డాక్టర్లు ఉండాల్సిన చోట కేవలం 22 మంది మాత్రమే విధుల్లో ఉన్నారని తెలిపారు. 16 మంది సివిల్ సర్జన్లకు గాను ముగ్గురే ఉన్నారని, 37 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లలో మెజారిటీ కాంట్రాక్ట్ వారేనని, అందులోనూ ఆరుగురు డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారని వివరించారు. ఆర్థోపెడిక్, పీడియాట్రిక్ (పిల్లల వైద్యం), ఈఎన్‌టీ విభాగాల్లో సగం మంది కూడా లేరని, ఆయుర్వేదం, హోమియో, జనరల్ మెడిసిన్, స్కిన్ విభాగాల్లో అసలు ఒక్క డాక్టర్ కూడా అందుబాటులో లేరని పేర్కొన్నారు. వైద్యులతో పాటు నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది కొరత కూడా వేధిస్తోందని వెస్లీ తెలిపారు. 53 మంది నర్సింగ్ సిబ్బందికి కేవలం 28 మందే ఉన్నారని, చిల్డ్రన్స్ ఐసీయూలోనూ తీవ్ర కొరత ఉందన్నారు. ఒక్కో స్టాఫ్ నర్స్ ఏకంగా మూడు వార్డులను చూసుకోవాల్సి వస్తోందని, దీనివల్ల వారిపై తీవ్ర పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. బ్లడ్ బ్యాంక్ నిర్వహణకు, రేడియాలజీ విభాగానికి అసలు టెక్నీషియన్లే లేరని స్పష్టం చేశారు. ఆసుపత్రిని శుభ్రంగా ఉంచే శానిటేషన్ వర్కర్లు 160 మంది ఉండాల్సి ఉంటే, కేవలం 85 మందితోనే సరిపెడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. పెరిగిన పనిభారానికి తగ్గట్టుగా కాకుండా వారికి కేవలం రూ.11 వేల కనీస వేతనం మాత్రమే ఇస్తున్నారని, వారికి కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదన్నారు. ఆసుపత్రి సామర్థ్యం 200 పడకలదే అయినప్పటికీ, నిత్యం 250 మందికి పైగా రోగులు ఇక్కడ చికిత్స పొందుతున్నారని జాన్ వెస్లీ తెలిపారు. హాస్పిటల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ లేకపోవడం వల్ల రెండు అంబులెన్స్‌లలో ఒకటి గత రెండేళ్లుగా రిపేరులోనే మగ్గుతోందని సీఎం దృష్టికి తెచ్చారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని భద్రాచలం ఆసుపత్రిని తక్షణమే సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా మార్చాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న డాక్టర్, నర్సింగ్, టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేయాలని, అత్యవసర మందులు, ఆధునిక యంత్రాలను సరఫరా చేయాలన్నారు. శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనాలు పెంచడంతో పాటు, అత్యంత కీలకమైన అడ్వాన్స్ ట్రామా సెంటర్‌ను భద్రాచలంలో ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు.

## ఉద్యమకారుల గుర్తింపుపై త్వరలో నిర్ణయం: కోదండరాం

హైదరాబాద్, జూన్ 21 (ఈవార్తలు): తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు అంశం పై త్వరలోనే స్పష్టమైన నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ జిల్లా స్థాయి సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యమకారుల సమస్యలు, విన్నపాలను గుర్తింపు కమిటీ దృష్టికి తీసుకెళ్లి తగిన నిర్ణయాలు తీసుకునేలా కృషి చేస్తానన్నారు. వేలాది మంది త్యాగాలు, బలిదానాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని పేర్కొంటూ, ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీల అమలులో జాప్యం జరగకూడదన్నారు. 1969 ఉద్యమం నుంచి రాష్ట్ర సాధన వరకు పోరాడిన ఉద్యమకారులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలని కోరారు. ఉద్యమకారుల పై నమోదైన కేసుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని జర్నలిస్టులను కూడా ఉద్యమకారులుగా గుర్తించే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ పై కొందరు పొరుగు రాష్ట్రాల నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఖండించిన కోదండరాం, ప్రజల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు మంచివి కావన్నారు. అలాగే గోదావరి, కృష్ణా జలాల పంపిణీ, పోతిరెడ్డిపాడు, పోలవరం వంటి అంశాల్లో తెలంగాణ హక్కులకు అనుగుణంగా న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ జేఏసీ కన్వీనర్ డోలి సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు అంబటి శ్రీనివాస్, పిల్లి సుధాకర్, శాంతన్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత బీటీ-3 పై ఉక్కుపాదం

మహబూబాబాద్, జూన్ 21 (ఈవార్తలు): తెలంగాణలో బీటీ 3 విత్తనాల వాడకం పై నిషేధం ఉందని, నిషేధిత బీటీ 3 విత్తనాలు విక్రయించినా, వేసినా నేరమేనని మరిపెడ ఎస్హెచ్ వో గండ్రాతి సతీష్, ఏవో వీరాసింగ్ హెచ్చరించారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని గుండెపుడి గ్రామంలో పోలీసులు, వ్యవసాయ అధికారులు జిల్లా ఎస్పీ శబరీష ఆదేశానుసారం సీఐ పవన్ కుమార్ నేతృత్వంలో సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురి ఇండ్లు, వ్యవసాయ క్షేత్రాల నుంచి ప్రభుత్వం నిషేధించిన సుమారు 12 కేజీలు రూ.26 వేలు విలువ చేసే బీటీ 3 విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బీటీ 3 అనేది పర్యావరణానికి మానావాళి మనుగడకు ప్రమాదమని, తెలంగాణలో ఈ రకం విత్తనాలు నిషేదమన్నారు. ఈ విత్తనాలు కొనుగోలు చేసి నాటినా కూడా అనుమానం కలిగిన పంటకు డీఎన్ఏ టెస్టు నిర్వహించి బీటీ 3 అని తేలితే పంట తొలగించటం జరుగుతుంని హెచ్చరించారు. గుండెపుడి గ్రామంతో పాటుగా చుట్టు ప్రక్కల మండలాలు, ఆంధ్రా నుంచి వచ్చే ప్రతి విత్తనాల పై ప్రత్యేక నిఘా ఉంచామని, గత కొన్నేళ్లుగా జరుగుతున్న ఈ నిషేధిత దందా పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోనుందన్నారు. ఈ సెర్చ్ లో ఎస్ఐలు గండ్ర సంతోష్ కుమార్, మహబూబ్ బీ, హెడ్ కానిస్టేబుల్ బలరాం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రాహుల్‌తో అపాయింట్‌మెంట్ ఇప్పించండి

**సీఎంకు బీజేపీ స్టేట్ చీఫ్ బహిరంగ లేఖ**

హైదరాబాద్, జూన్ 21 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న వివిధ వర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, నిరాశ పెరుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పేర్కొన్నారు. ప్రజల ఆందోళనలను, సమస్యలను నేరుగా రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుగా, వీలైనంత త్వరగా ఆయనతో అపాయింట్‌మెంట్ కల్పించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఒకవేళ కాంగ్రెస్ నాయకత్వం స్పందించడంలో, అపాయింట్‌మెంట్ కల్పించడంలో విఫలమైతే రాష్ట్ర ప్రజలకు చేసిన తీవ్ర ద్రోహాన్ని మాత్రమే రుజువు చేస్తుందన్నారు. ఆదివారం సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా వివరిస్తూ 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీ వ్యక్తిగతంగా ఇచ్చిన హామీలు, గ్యారంటీల ఆధారంగానే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై నమ్మకం ఉంచారని లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత, వృద్ధులు, వ్యవసాయ కార్మికులు, పేద కుటుంబాలకు ఇచ్చిన పలు కీలక హామీలు ఇంకా నెరవేర్చ లేదన్నారు.

## జర్మనీ టూర్‌కు 35 మంది విద్యాశాఖ అధికారులు!

**సాంకేతిక విద్యాశాఖ నుంచి 7గురికి అవకాశం**

హైదరాబాద్, జూన్ 21 (ఈవార్తలు): ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యా ప్రమాణాలను పెంచే లక్ష్యంతో, అంతర్జాతీయ బోధనా పద్ధతులను పరిశీలించేందుకు ఈ నెల 28 న 35 మంది తో కూడిన విద్యాశాఖ అధికారుల బృందం జర్మనీ వెళ్లనుంది. అందులో సాంకేతిక విద్యాశాఖ నుంచి 7 గురు సభ్యులను ఎంపిక చేశారు. ఇదే విషయమై ఇటీవల ఆ శాఖలో అంతర్గతంగా చర్చ నడుస్తోంది. 7 గురు సభ్యుల్లో ముగ్గురు అనర్హులను ఎంపిక చేశారంటూ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 28వ తేదీన జర్మనీ దేశ పర్యటనకు వెళ్లనున్న అధికారుల బృందం అంతర్జాతీయంగా సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అధ్యయనం చేయనున్నారు.

# తెలంగాణ నుంచి రాజ్యసభకు మీనాక్షి?

హైదరాబాద్, జూన్ 21 (ఈవార్తలు): మధ్యప్రదేశ్ నుండి రాజ్యసభ స్థానానికి తాను దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురికావడంపై తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ మరోసారి తీవ్రంగా స్పందించారు. ఈ వ్యవహారంలో బీజేపీ కావాలనే తనపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆమె మండిపడ్డారు. తనపై ప్రస్తుతం ఎలాంటి లీగల్ కేసులు లేవని, చట్టబద్ధంగా తాను అన్ని నిబంధనలను పాటించానని స్పష్టం చేశారు. ఇటీవల మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ స్థానానికి ఆమె వేసిన నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించిన విషయం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపింది. ఒక పాత కేసు అంశాన్ని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొనలేదనే సాంకేతిక కారణాన్ని చూపుతూ ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో మీనాక్షి నటరాజన్ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ, ఎన్నికల సంఘంపై సంచలన ఆరోపణలు చేశారు. అధికార బీజేపీ, ఈసీ లాలూచీపడి, కుట్రపూరితంగా తన నామినేషన్‌ను తిరస్కరించాయని ఆమె ధ్వజమెత్తారు. తన రాజ్యసభ సీటు తీవ్రమైన కుట్రతో చోరీకి గురైందన్నారు. బీజేపీ ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా చేస్తున్న కుట్రలను, అక్రమాలను సమాజానికి విడమరిచి చెప్పడానికే తాము ఈ లీగల్ పోరాటాన్ని కొనసాగిస్తున్నామన్నారు. కొందరు ప్రచారం చేస్తున్నట్లు తనకోసం మరొకరితో బలవంతంగా రాజీనామా చేయించి, తెలంగాణ కోటాలో తాను రాజ్యసభ సీటును తీసుకోలేనని చెప్పారు. తాను పుట్టి పెరిగింది, రాజకీయాలు చేసింది మధ్యప్రదేశ్‌లోనే కాబట్టి ఆ రాష్ట్ర ప్రజల తరఫునే తాను రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించాలని కోరుకుంటానని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత శత్రువులే మీనాక్షి నటరాజన్ కేసుల వివరాలను ప్రత్యర్థి పార్టీకి అందించారంటూ వస్తున్న వార్తలను ఆమె తీవ్రంగా ఖండించారు. తన కేసుల సమాచారాన్ని కాంగ్రెస్ నేతలే ప్రత్యర్థులకు ఇచ్చారనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, అది పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. బీజేపీ తన ఓటమి భయంతోనే ఇటువంటి అసత్య ప్రచారాలకు తెరలేపిందని విమర్శించారు.



అఫిడవిట్‌లో చిన్న పొరపాటు జరిగినంత మాత్రాన నామినేషన్ తిరస్కరించాల్సిన అవసరం లేదని.. దీని వెనుక పెద్ద రాజకీయ హస్తం ఉందని ఆరోపించారు. స్క్రూటినీ జరుగుతున్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా బీజేపీ నేతలను నామినేషన్ రూమ్‌లోకి అధికారులు ఎందుకు అనుమతించారని ఆమె ఈసీని నిలదీశారు. కాగా, మీనాక్షి నటరాజన్ గతంలో రాహుల్ గాంధీ కోటరీలో అత్యంత కీలక నేతగా పనిచేశారు. మధ్యప్రదేశ్ మందసౌర్ లోక్‌సభ నియోజకవర్గం నుండి ఎంపీగా కూడా ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం ఆమె తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తుండటంతో.. ఈ నామినేషన్ తిరస్కరణ అంశం తెలంగాణ రాజకీయాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ శ్రేణులు ఈ తిరస్కరణను కేంద్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యగా అభివర్ణిస్తుండగా.. నిబంధనల ప్రకారమే ఈసీ నిర్ణయం తీసుకుందని బీజేపీ వాదిస్తోంది. ఈ నామినేషన్ తిరస్కరణపై న్యాయపరంగా ముందుకు వెళ్లేందుకు కాంగ్రెస్ లీగల్ టీమ్ ఇప్పటికే కసరత్తు చేస్తోంది.




## కాలి బూడిదైన ఆర్టీసీ బస్సు

**కరీంనగర్‌లో ఘటన.. డ్రైవర్ అప్రమత్తతో 41 మంది సేఫ్**

**షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని అంచనా**

కరీంనగర్, జూన్ 21 (ఈవార్తలు): కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అయితే, డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో 41 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనతో పెను ప్రమాదం తప్పినట్లయింది. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ డిపోకు చెందిన ఎలక్ట్రిక్ బస్సు ఆదివారం ఉదయం 41 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరింది. బస్సు అలుగునూరు దాటి కాకతీయ కాలువ సమీపానికి చేరుకోగానే ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. వెంటనే గమనించిన డ్రైవర్ ప్రశాంత్, బస్సును రోడ్డు పక్కన ఆపివేశారు. క్షణాల్లోనే ఆయన బస్సు డోర్‌తో పాటు ఎమర్జెన్సీ ద్వారాన్ని కూడా తెరిచి ప్రయాణికులందరినీ కిందకు దింపేశారు. ప్రయాణికులు కిందకు దిగిన నిమిషాల వ్యవధిలోనే బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ అప్రమత్తత వల్లే పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

## వాష్రూమ్ లో ఫోన్ దాచి పరీక్షకు!

**హైదరాబాద్‌లో నీట్ రీ-ఎగ్జామ్‌లో మాల్‌ప్రాక్టీస్**

హైదరాబాద్, జూన్ 21 (ఈవార్తలు): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న నీట్ పరీక్షల వ్యవహారంలో మరో ఘటన వెలుగుచూసింది. హైదరాబాద్‌లో జరిగిన నీట్ రీ-ఎగ్జామ్‌లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన ఓ విద్యార్థిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాగన్నగూడలోని జడ్పీహెచ్ఎస్ పరీక్షా కేంద్రంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పక్కా ప్రణాళికతో అక్రమానికి యత్నించిన ఆ విద్యార్థి చివరికి ఇన్విజిలేటర్లకు అడ్డంగా దొరికిపోయాడు. వివరాల్లోకి వెళితే, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన ఓ విద్యార్థి నీట్ పరీక్షలో కాపీ కొట్టేందుకు హైటెక్ పద్ధతిని ఎంచుకున్నాడు. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా, ఉదయం 7 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకున్నాడు. ఎవరూ గమనించని సమయంలో పాఠశాల వాష్‌రూమ్ వెంటిలేటర్‌లో తన స్మార్ట్‌ఫోన్‌ను దాచిపెట్టాడు. అనంతరం, మధ్యాహ్నం అందరితో పాటు పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించాడు. లోపలికి వెళ్లాక వాష్‌రూమ్‌కు వెళ్లి, ఫోన్‌ను తీసుకుని జిప్ లాక్ కవర్‌లో పెట్టి టాయిలెట్ ఫ్లష్ ట్యాంకులో దాచాడు. సిబ్బంది రెండుసార్లు తనిఖీలు చేసినప్పటికీ ఈ విషయాన్ని గుర్తించలేకపోయారు. పరీక్ష మొదలైన కొంతసేపటికి విద్యార్థి కడుపునొప్పి వస్తోందంటూ ఇన్విజిలేటర్ అనుమతితో వాష్‌రూమ్‌కు వెళ్లాడు. అయితే, చాలాసేపటి వరకు తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన ఇన్విజిలేటర్లు వాష్‌రూమ్ వద్దకు వెళ్లి చూడగా, విద్యార్థి ఫోన్‌లో సమాధానాలు వెతుకుతూ కనిపించాడు. వెంటనే అతడిని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విద్యార్థిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి ఫోన్‌ను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.




నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
| --- | --- | --- |
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines - Rs.450
(for each extra line - Rs.90)

COLOUR:
Price for 5 Lines - Rs.500
(for each extra line - Rs.100)

Phone: +91 94404 55811 | Email: contact@evarthalu.com

మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## బొగ్గు మాయం ఆరోపణలు తప్పు

**స్పష్టం చేసిన సింగరేణి యాజమాన్యం**

**బొగ్గు ఉత్పత్తి, రవాణాలో పారదర్శకత ఉందని స్పష్టం**

రామగుండం, జూన్ 21 (ఈవార్తలు): సింగరేణిలో రూ.1,600 కోట్ల విలువైన భారీ బొగ్గు కుంభకోణం జరిగిందంటూ వస్తున్న ఆరోపణలను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్ సీసీఎల్) తీవ్రంగా ఖండించింది. సుమారు 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. బొగ్గు ఉత్పత్తి, నిల్వ, రవాణా, విక్రయాల వరకు ప్రతి దశ పూర్తి పారదర్శకంగా, అత్యాధునిక సాంకేతిక వ్యవస్థల పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపింది. సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు గల్లంతైందని, దీనిపై తక్షణమే విచారణ జరపాలని కోరుతూ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఇటీవలే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఈ లేఖతో పాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేయడంతో ఈ అంశం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే సింగరేణి యాజమాన్యం వివరణ ఇచ్చింది. గనుల్లో బొగ్గు వెలికితీసిన క్షణం నుంచి వినియోగదారుడికి చేరే వరకు ప్రతి అంశం డిజిటల్‌గా నమోదవుతుందని కంపెనీ వివరించింది. సుమారు 85 శాతం బొగ్గు రైళ్ల ద్వారా, మిగిలిన 15 శాతం రోడ్డు మార్గంలో రవాణా అవుతుందని, శాప్ (ఎస్ఏపీ) ఆధారిత ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ ద్వారా బొగ్గు కేటాయింపులు జరుగుతాయని పేర్కొంది. రోడ్డు మార్గంలో వెళ్లే ప్రతి వాహనాన్ని ఎలక్ట్రానిక్ వే-బ్రిడ్జ్‌ల వద్ద తూకం వేస్తామని, ఆర్ఎఫ్ఐడీ ఆధారిత బూమ్ బారియర్లు, జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా వాహనాల కదలికలను పర్యవేక్షిస్తామని అధికారులు తెలిపారు. సీసీటీవీ కెమెరాలు, ఆర్ఎఫ్ఐడీ వ్యవస్థలు, చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌ల వంటి బహుళస్థాయి భద్రతా వ్యవస్థ పటిష్టంగా ఉందని యాజమాన్యం స్పష్టం చేసింది. ఇంతటి కట్టుదిట్టమైన భద్రత మధ్య బొగ్గు దొంగతనం లేదా మాయం కావడానికి ఆస్కారమే లేదని, ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని కొట్టిపారేసింది. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వానికి 51:49 వాటాలు ఉన్న సింగరేణి సంస్థలో ఈ ఆరోపణలు కలకలం రేపాయి.

## నా మనసు ఆనందంతో నిండిపోయింది: పొన్నం

హైదరాబాద్, జూన్ 21 (ఈవార్తలు): నీట్ పరీక్ష సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం కల్పించిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వేలాది మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రత్యేక సౌకర్యం ద్వారా విద్యార్థులు ఎలాంటి రవాణా ఇబ్బందులు లేకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాశారని ఆయన తెలిపారు. నీట్ విద్యార్థులు ఉచిత ప్రయాణ సౌకర్యం వినియోగించుకోవడం చూశాక మనసంతా ఆనందంతో నిండిపోయిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయం, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఈ ఉచిత ప్రయాణ సౌకర్యంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. విద్యార్థుల ఉన్నత లక్ష్యాల సాధనలో వారికి అన్ని విధాలుగా అండగా నిలిచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రజా పాలనలో భాగంగా విద్యార్థుల సంక్షేమానికి మరిన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

## ముంబైలో మళ్లీ కరోనా తాండవం

**విజృంభిస్తున్న కోవిడ్, స్వైన్ ఫ్లూ కేసులు**

**రుతుపవనాల ఆలస్యంతో శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు**

ముంబై: రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో ముంబై నగరం వైరల్ వ్యాధుల గుప్పిట్లో చిక్కుకుంది. ముఖ్యంగా గత కొన్ని వారాలుగా కోవిడ్-19, స్వైన్ ఫ్లూ, ఇన్‌ఫ్లుయెంజా వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల కేసులు గణనీయంగా పెరిగాయి. దీంతో నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలతో బాధపడుతూ అనేకమంది వైద్యులను ఆశ్రయిస్తున్నారు. దాదాపు నెల రోజుల పాటు స్వైన్ ఫ్లూ కేసులు అధికంగా నమోదు కాగా, గత వారం నుంచి కోవిడ్ కేసులు మళ్లీ పుంజుకున్నాయని వైద్యులు చెబుతున్నారు. బ్రీచ్ క్యాండీ వంటి ఆస్పత్రుల్లోని ల్యాబ్‌లలో ప్రతిరోజూ 7కు పైగా కోవిడ్ లేదా స్వైన్ ఫ్లూ పాజిటివ్ కేసులు వెలుగుచూస్తున్నాయి. ఒకేసారి పలు వైరస్‌లు వ్యాప్తిలో ఉండటంతో, లక్షణాలు ఒకేలా ఉండటంతో నిర్ధారణ కోసం పీసీఆర్ పరీక్షలు అవసరమవుతున్నాయని సీనియర్ వైద్యులు పేర్కొంటున్నారు. రుతుపవనాల రాక ఆలస్యం కావడం, వాతావరణంలో తేమ ఎక్కువగా ఉండటమే ఈ వైరస్‌ల వ్యాప్తికి ప్రధాన కారణంగా అధికారులు భావిస్తున్నారు. గాలిలో వైరస్‌లు ఎక్కువసేపు నిలిచిపోవడానికి ఈ పరిస్థితులు దోహదపడుతున్నాయని బీఎంసీ ఎగ్జిక్యూటివ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ దక్షా షా తెలిపారు. వర్షాలు విస్తారంగా కురిస్తే వాతావరణం శుభ్రపడి, వైరస్‌ల వ్యాప్తి తగ్గుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో ఎక్కువ శాతం స్వల్ప లక్షణాలతోనే ఉన్నప్పటికీ, వృద్ధులు, గర్భిణులు, మధుమేహం, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సొంతంగా యాంటీబయాటిక్స్ వాడొద్దని, లక్షణాలు తీవ్రంగా ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో మాస్కులు ధరించడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని అధికారులు కోరుతున్నారు.

## నీట్ విద్యార్థుల కోసం మోదీ గంట సేపు వెయిటింగ్

**ట్రాఫిక్ సమస్య ఉండొద్దని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లోనే ఉండిపోయిన ప్రధాని**

**పరీక్ష ప్రారంభమయ్యాకే తన నివాసానికి బయలుదేరిన మోదీ**

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థుల పట్ల తనకున్న ప్రత్యేక శ్రద్ధను మరోసారి చాటుకున్నారు. నీట్-యూజీ 2026 రీ-ఎగ్జామ్ రాసే విద్యార్థులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో, ఆయన ఢిల్లీ విమానాశ్రయంలోనే దాదాపు గంటసేపు వేచి ఉన్నారు. ఈ సంఘటన ఆయన మానవతా దృక్పథాన్ని తెలియజేస్తోందని పలువురు ప్రశంసిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా కోల్‌కతాలో జరిగిన ప్రధాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ, ఆదివారం మధ్యాహ్నం 1:15 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఆయన నేరుగా తన అధికారిక నివాసానికి వెళ్లాల్సి ఉంది. అయితే, మధ్యాహ్నం 2 గంటలకు దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష ప్రారంభం కానుండటంతో, తన కాన్వాయ్ కారణంగా రోడ్లపై ట్రాఫిక్ జామ్ అయి విద్యార్థులు ఇబ్బంది పడతారని ప్రధాని భావించారు. దీంతో పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని, ఆయన విమానాశ్రయం నుంచి బయటకు రాకుండా అక్కడే వేచి ఉండాలని నిర్ణయించుకున్నారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత, అంటే మధ్యాహ్నం 2 గంటల తర్వాతే ఆయన తన నివాసానికి బయలుదేరారు. మరోవైపు, దేశవ్యాప్తంగా 20 లక్షల మందికి పైగా విద్యార్థులు కట్టుదిట్టమైన భద్రత నడుమ నీట్ రీ-ఎగ్జామ్‌కు హాజరయ్యారు.



## 'అయోధ్య' అక్రమాల నివేదిక యోగి చేతికి

**ప్రాథమిక నివేదిక సమర్పించిన సిట్**

అయోధ్య/లక్నో: అయోధ్య రామమందిరంలో భక్తులు సమర్పించిన విరాళాలకు సంబంధించి అవకతవకలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై విచారించేందుకు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) ఏర్పాటు చేసింది. ఈ విచారణకు సంబంధించిన ప్రాథమిక నివేదికను సిట్.. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు ఆదివారం అందించింది. ఈ నెల 13న సిట్ ఏర్పాటైంది. ఈ సిట్‌లో లక్నో డీసీ విజయ్ విశ్వాస్ పంత్, ఐజీ రేంజ్ కిరణ్, ఫైనాన్స్ స్పెషల్ సెక్రెటరీ నీల్ రతన్ సభ్యులుగా ఉన్నారు. అయోధ్య రామాలయాన్ని శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్ నిర్వహిస్తోంది. ఈ రామాలయానికి భక్తులు సమర్పించిన విరాళాల్ని దారి మళ్లించడం, దేవాలయ ట్రస్ట్ అకౌంట్‌లో జమ చేయకపోవడం వంటి అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ప్రభుత్వం దీన్ని విచారించేందుకు సిట్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా కొన్ని అవకతవకలు జరిగినట్లు సిట్ గుర్తించింది. భక్తులు సమర్పించిన బంగారం, వెండి, రాళ్లు, వజ్రాలు వంటి వాటికి సంబంధించి డాక్యుమెంట్లలో తేడాలున్నట్లు సిట్ తేల్చింది. ఈ అంశంపై పలువురు అధికారుల్ని సిట్ విచారించింది. అనేక ఆధారాల్ని సేకరించింది. ఈ అంశంలో సిట్ అడిగిన ప్రశ్నలకు అధికారులు సరైన సమాధానాలు చెప్పలేదు. ఆభరణాల నిర్వహణ, నిల్వ, లెక్కలు వంటి అంశాల్లో నిబంధనలు పాటించలేదని తేలింది. ముఖ్యంగా గత ఏడాది జనవరి, ఫిబ్రవరిలలో జరిగిన కుంభమేళా సందర్భంగా వచ్చిన కానుకల్లో చాలా అవకతవకలున్నట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఈ రెండు నెలల కాలంలోనే ఇక్కడికి దాదాపు 10 లక్షల మంది భక్తులు వచ్చారు. ఈ సమయంలో హుండీలు, విరాళాలు సమర్పించే బాక్సులు గంటల వ్యవధిలోనే నిండిపోయాయి. భారీ ఎత్తున నగదు, ఆభరణాలు జమయ్యాయి. ఇలా భారీ విరాళాలు రావడంతో కొందరు అధికారులు వీటి విషయంలో కక్కుర్తి పడ్డట్లు సమాచారం. దేవాలయానికి జమ చేయకుండా కాజేసినట్లు అనుమానాలున్నాయి. ఈ అంశాలన్నింటిపై విచారణ జరుగుతోంది. ఇందులో అధికారులు, నిర్వాహకులు, సిబ్బంది పాత్రపై అనుమానాలున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఆలయ ట్రస్ట్‌కు సంబంధించిన ఉద్యోగులు, సిబ్బంది ఎవరూ అయోధ్య దాటి వెళ్లకూడదని సిట్ అధికారులు ఆదేశించారు. మరోవైపు ఈ అంశంపై సీఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ.. నిందితుల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమన్నారు.

## రష్యా నుంచి పెరిగిన చమురు దిగుమతి

మాస్కో/న్యూఢిల్లీ: హోర్ముజ్ జలసంధి పరిసరాల్లో నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో దేశీయ రిఫైనరీలు ముడి చమురు సరఫరాను సురక్షితం చేసుకోవడంపై దృష్టి సారించాయి. సముద్ర రవాణా, కమొడిటీ ఇంటెలిజెన్స్ సంస్థ 'కెప్లర్' గణాంకాల ప్రకారం ఈ నెల 1 నుంచి 19 మధ్య కాలంలో రష్యా నుంచి రోజుకు సగటున 26.6 లక్షల బ్యారెళ్ల ముడి చమురును భారత్ దిగుమతి చేసుకుంది. మే నెలతో పోలిస్తే 39 శాతం మేరకు పెరిగింది. యూఏఈ నుంచి దిగుమతులు దాదాపు 6.36,00 బ్యారెళ్లు తగ్గాయి. వెనిజువెలా భారత్‌కు నాలుగో అతి పెద్ద సరఫరాదారుగా అవతరించగా, సౌదీ అరేబియా దాదాపు 3,84,000 బ్యారెళ్లను సరఫరా చేసింది. అమెరికా నుండి ముడి చమురు దిగుమతులు మేలో రోజుకు 2,52,000 బ్యారెళ్లుగా ఉండగా, జూన్ నాటికి 91,000 బ్యారెళ్లకు పడిపోయాయి.







# 3 స్వదేశీ నౌకలు ప్రారంభం

## రక్షణ రంగంలో భారత్ మరో ముందడుగు.. దేశానికి అంకితమిచ్చిన ప్రధాని మోదీ

కోల్‌కతా: భారత నౌకాదళ శక్తిని, రక్షణ రంగంలో దేశ స్వావలంబనను చాటిచెబుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ముందడుగు వేశారు. కోల్‌కతాలోని శ్యామ ప్రసాద్ ముఖర్జీ పోర్టులో ఈరోజు జరిగిన కార్యక్రమంలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన మూడు నౌకలను ఆయన ప్రారంభించి జాతికి అంకితం చేశారు. స్టెల్త్ యుద్ధ నౌక 'దూనగిరి', భారీ సర్వే నౌక 'సంశోధక్', జలాంతర్గామి విధ్వంసక నౌక 'అగ్రే'లను ప్రధాని లాంఛనంగా ప్రారంభించారు. ఈ మూడు నౌకలు యుద్ధ, సర్వే, జలాంతర్గామి నిరోధక కార్యకలాపాల్లో నౌకాదళ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్ ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. "రక్షణ రంగంలో భారత్ ఇకపై కేవలం కొనుగోలుదారుగా మిగిలిపోదు. మన సైనిక శక్తి




ప్రపంచానికి మార్కెట్‌గా మారకూడదు. మన బలానికి నిర్వచనం ప్రపంచానికి మార్కెట్‌గా మారడంలో లేదు, మన స్వావలంబనలోనే ఉంది" అని ఆయన స్పష్టం చేశారు. ఈ మూడు నౌకలు భారత పరిశ్రమల ప్రతిభకు, ఇంజనీర్ల నైపుణ్యానికి, కార్మికుల కఠోర శ్రమకు నిదర్శనమని, ఇదే నవ భారతానికి ఉన్న అతిపెద్ద బలమని ప్రధాని అన్నారు. కొన్నేళ్ల క్రితం ఐఎన్ఎస్ విక్రాంత్‌ను జాతికి అంకితం చేసినప్పుడు సముద్ర శక్తిలో భారత్ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందని గుర్తుచేశారు. ఐఎన్ఎస్ విక్రాంత్ నుంచి నేటి వరకు సాగిన ఈ ప్రయాణం కేవలం కొత్త యుద్ధ నౌకలది మాత్రమే కాదని, పెరుగుతున్న భారత స్వావలంబన ప్రయాణం అని ఆయన అభివర్ణించారు. "ఏ దేశానికైతే బలమైన సముద్ర శక్తి ఉంటుందో, ఆ దేశానికి బలమైన ఆర్థిక, వ్యూహాత్మక ప్రభావం ఉంటుంది. ఈ వాస్తవాన్ని భారత్ బాగా అర్థం చేసుకుని, అందుకు తగ్గట్టుగా సిద్ధమవుతోంది," అని మోదీ తెలిపారు.

### మూడు నౌకల ప్రత్యేకతలు

**దూనగిరి:** ఇది అత్యాధునిక స్టెల్త్ యుద్ధ నౌక. బ్రహ్మోస్ క్షిపణులు, మధ్యశ్రేణి గగనతల క్షిపణి వ్యవస్థ వంటి శక్తిమంతమైన ఆయుధాలు, సెన్సార్లతో దీన్ని తీర్చిదిద్దారు. సుదీర్ఘ సముద్ర కార్యకలాపాలకు అనువుగా, బహుముఖ ఆధిపత్యం ప్రదర్శించేలా దీనిని రూపొందించారు.


**సంశోధక్:** ఇది ఒక భారీ సర్వే నౌక. తీరప్రాంత, లోతైన సముద్ర జలాల్లో హైడ్రోగ్రాఫిక్ సర్వేలు నిర్వహించడానికి, రక్షణ, పౌర అవసరాల కోసం సముద్ర గర్భ డేటాను సేకరించడానికి ఇది ఉపయోగపడుతుంది. అటానమస్ అండర్‌వాటర్ వెహికల్స్, రిమోట్లీ ఆపరేటెడ్ వెహికల్స్ వంటి అధునాతన వ్యవస్థలు ఇందులో ఉన్నాయి.

**అగ్రే:** ఇది అర్నాల తరగతికి చెందిన జలాంతర్గామి విధ్వంసక నౌక. తీరప్రాంత జలాల్లో శత్రు జలాంతర్గాములను గుర్తించి, నాశనం చేసేందుకు దీన్ని రూపొందించారు. తేలికపాటి టార్పెడోలు, స్వదేశీ రాకెట్ లాంచర్లు, అత్యాధునిక సోనార్ వ్యవస్థలు దీని ప్రత్యేకతలు. ఈ కార్యక్రమంలో పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి సువేందు అధికారి, భారత నౌకాదళ అధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రంప్ అబద్ధాల కోరు, మిత్ర ద్రోహి

**ఇటలీ ప్రధాని మెలోనీ ఫైర్**

రోమ్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆయన మిత్రురాలి నుంచే ఊహించని రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. యూరప్‌లో ట్రంప్‌కు అత్యంత సన్నిహితురాలిగా, ఆయన విధానాలకు మద్దతుదారుగా పేరు పొందిన ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ, ఇప్పుడు ఆయనపై తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. ట్రంప్ ఒక అబద్ధాల కోరని, మిత్రులను కాదని శత్రువులకు వంత పాడతారని ఆమె తీవ్రంగా విమర్శించారు. అంతేగాక నవంబర్ మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్న వేళ, పడిపోతున్న తన పాప్యులారిటీని చూసుకోవాలంటూ ట్రంప్‌కు చురకలు అంటించారు. జీ7 దేశాల నేతల్లో మరెవరూ చేయని సాహసాన్ని మెలోనీ చేయడం ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన జీ7 శిఖరాగ్ర సమావేశం ఎంతో ఉత్సాహభరితంగా ముగిసిందని ట్రంప్ ప్రకటించిన కొద్ది గంటల్లోనే ఈ అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఈ సమావేశంలో ఇరాన్‌తో శాంతి ఒప్పందంపై ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై పలువురు నేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసినా, చివరికి అంతా సర్దుకుపోయారు. కానీ, సమావేశం ముగిసిన వెంటనే మెలోనీ నేరుగా ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ పరిణామాల నేపథ్యంలో, మయామిలో జరగాల్సిన యూఎస్-ఇటలీ బిజినెస్ ఫోరమ్‌ను ఇటలీ విదేశాంగ శాఖ రద్దు చేసింది. ఈ ఫోరమ్‌లోనే అమెరికా ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'పాక్స్ సిలికా' అనే కీలక ఖనిజాల ఒప్పందంపై ఇటలీ అధికారికంగా సంతకం చేయాల్సి ఉంది. తాజా విభేదాలతో ఈ ఒప్పందం భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. నిజానికి 2025లో ట్రంప్ తిరిగి అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి యూరప్‌లోని చాలా మంది నేతలు ఆయనతో నేరుగా ఘర్షణకు దిగడం నష్టదాయకమని భావిస్తూ వచ్చారు. గతంలో ట్రంప్.. మెలోనీ అందాన్ని పొగిడినప్పుడు, దానిపై విమర్శలు వచ్చినా ఆమె మౌనంగానే ఉన్నారు. కానీ ఇప్పుడు ఆమె వైఖరి పూర్తిగా మారింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, యూకే ప్రధాని కీర్ స్టార్మర్, జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ వంటి నేతలు ట్రంప్‌తో విభేదించినా, సర్దుకుపోయే ధోరణినే ప్రదర్శించారు. కానీ, మెలోనీ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. వచ్చే ఏడాది ఇటలీలో జరగనున్న ఎన్నికలే మెలోనీ వ్యూహం మార్చుకోవడానికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. 'యూరప్‌లో ట్రంప్‌కు కీలుబొమ్మ' అనే ముద్ర తన రాజకీయ భవిష్యత్తుకు నష్టం చేస్తుందని ఆమె గ్రహించినట్లున్నారు. ట్రంప్‌ను బహిరంగంగా సవాలు చేయడం ద్వారా ఓటర్ల వద్ద మంచి మార్కులు కొట్టేయవచ్చనే కొత్త సిద్ధాంతాన్ని మెలోనీ పరీక్షిస్తున్నారని రోమ్‌లోని లూయిస్ యూనివర్సిటీ పరిశోధకుడు లొరెంజో కాస్టెల్లని అభిప్రాయపడ్డారు.



# డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

## తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య



హైదరాబాద్, జూన్ 21 (ఈవార్తలు): యువతను పట్టి పీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతి పౌరుడు కంకణబద్ధుడు కావాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య పిలుపునిచ్చారు. నేటి యువత దేశ భవిష్యత్తును నిర్ణయించే కీలక శక్తి అని, వారు మాదక ద్రవ్యాలపై మళ్లకుండ ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరముందన్నారు." డ్రగ్స్ ఫ్రీ-యంగ్ ఇండియా" లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, ఈగల్ ఫోర్స్ సహకారంతో ఆదివారం హైదరాబాద్ లోని బిర్లా ఆడిటోరియం తెలంగాణ అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో "శపథ్" పేరుతో యువతకు అవగాహనా మరియు ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులు సందీప్ శాండిల్య, తెలంగాణ బిసి సంక్షేమ శాఖ సలహాదారు వి.హనుమంతరావు, మాజీ ఎంపి గిరీష్ సంఘీ, ఈగల్స్ ఫోర్స్ డిప్యూటీ డైరెక్టర్ కృష్ణామూర్తి గుప్తా, "శపథ్" నిర్వహణ కమిటీ అధ్యక్షులు రామ్ నివాస్ బన్సల్, ప్రాజెక్ట్ డైరెక్టర్ దేవేంద్ర శాస్త్రీ, "శపథ్" పబ్లిక్ రిలేషన్స్ డైరెక్టర్ సునీల్ అగర్వాల్, సలహాదారులు రాజీవ్ అగర్వాల్, విశాల్ కేడియా, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అనిల్ సింగ్, ప్యాట్రన్లు అనిరుధ్ గుప్తా, నరేంద్ర గోయల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సందీప్ శాండిల్యతెలంగాణలో డ్రగ్స్ వినియోగం ఆందోళనకరమైన స్థాయికి చేరుకుందని, ఈ మహమ్మారిని ఎదుర్కొనేందుకు సమాజంలోని అన్ని వర్గాలు కలిసికట్టుగా పోరాడాలన్నారు. 2019లో ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎఐఐఎంఎస్), కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహించిన సర్వే వివరాల ప్రకారం గంజాయి వినియోగంలో దేశంలోనే తెలంగాణ 28వ స్థానంలో ఉందన్నారు. అదేవిధంగా ఓపియాయిడ్స్ రాష్ట్రం 23వ స్థానం, అపస్మారక మందులు 19వ స్థానం, కొకైన్ వినియోగంలో తెలంగాణ 10వ స్థానంలో ఉందని వెల్లడించారు.హాలూసినోజెన్స్ వినియోగంలో రాష్ట్రం 3వ స్థానంలో ఉండగా, నేరుగా శరీరంలోకి డ్రగ్స్ ఇంజెక్ట్ చేసుకునే వారి సంఖ్యలో దేశంలోనే తెలంగాణ 5 వ స్థానంలో ఉండటం అత్యంత కలవరపరిచే అంశమన్నారు. రాష్ట్రంలో దాదాపు 30 వేల మంది కొకైన్ వినియోగదారులు ఉన్నట్లు సర్వే అంచనా వేసిందని చెప్పారు. 2019 నాటికే తెలంగాణలో వివిధ రకాల డ్రగ్స్ బారిన పడిన వారి సంఖ్య దాదాపు 22.5 లక్షలుగా ఉండగా ప్రస్తుత 2026 నాటికి ఈ సంఖ్య రెట్టింపై ఉండవచ్చని ఆయన అంచనా వేశారు. రాష్ట్రంలోని 4 కోట్ల జనాభాలో, గుట్కా, సిగరెట్లు, మద్యం మినహాయించి కేవలం డ్రగ్స్‌కు బానిసలైన వారే దాదాపు 50 లక్షల వరకు ఉండే అవకాశం ఉందన్నారు. యాంటీ నార్కోటిక్స్ బ్యూరోలో కేవలం 100 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారని, ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న వ్యసనపరులను పర్యవేక్షించడం కేవలం పోలీసుల వల్లే సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిరంతరం గమనించాలని సూచించారు. అదేవిధంగా సమాజంలోని వివిధ కుల సంఘాలు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు అందరూ బాధ్యతగా ముందుకు వచ్చి, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడానికి నడుం బిగించాలని సందీప్ శాండిల్య పిలుపునిచ్చారు. గిరిష్ సంఘీ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా అగర్వాల్ సమాజ్ చేపపడుతున్న ఈ కార్యక్రమానికీ ఆర్థికం, అన్నివిధాలుగా సహాయ సహకారం అందిస్తామని తెలిపారు. యువత డ్రగ్స్ భారిన పడకుండ తల్లిదండ్రులతో పాటు స్నేహితులది కూడ బాధ్యతే అన్నారు. వి.హనుమంతరావు మాట్లాడుతూ కాన్సర్‌కంటే ప్రమాదకరంగా మారిన డ్రగ్స్ భూతాన్ని తరిమి కొట్టడానికి ఒక పోలీసు శాఖ శక్తి సరిపోదని, సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు.



## శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో విశేష పూజలు

**ప్రత్యేక పల్లకి సేవ, పంచామృతాభిషేకం, అమృత నిర్గుండి కషాయం ఉచిత పంపిణీ**

జగిత్యాల, జూన్ 21 (ఈవార్తలు): సప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో శ్రీ ఉషా-ఛాయ సమేత శ్రీ సూర్యనారాయణ స్వామివారికి ఆదివారం ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష ఆర్చనలు, అనంతరం ప్రత్యేక పల్లకి సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం సూర్య భగవానునికి అంకితమైన పవిత్ర దినంగా భావిస్తూ, ఆరోగ్యం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, విజయాలు ప్రసాదిస్తారనే విశ్వాసంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులు స్వామివారికి ముడుపులు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు ఉచితంగా అమృత నిర్గుండి కషాయాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ వడ్లగట్ల రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, సహాయ కోశాధికారి గోపి, సహాయ కార్యదర్శి భారతాల రాజసాగర్, పెద్ది శ్రీనివాస్, వేముల రాజేశ్, యాంసాని శంకరయ్య, చెన్నూరి శ్రీధర్, ఎలిమేళ్ల సత్యనారాయణ, తాటిపల్లి ప్రవీణ్ కుమార్, హరీష్, అర్చకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## పట్టపగలే యువతి దారుణ హత్య

**నరసాపురంలో దారుణం**

**కత్తితో దాడి చేసిన మార్గాని రమేశ్ అనే వ్యక్తి**

నరసాపురం, జూన్ 21 (ఈవార్తలు): ఏఎన్ఎం శిక్షణ పూర్తి చేసుకుని ఇంటికి తిరిగి వస్తున్న ఓ యువతిని పట్టపగలే దారుణంగా హత్య చేసిన ఘటన పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, మృతురాలిని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి లంక గ్రామానికి చెందిన టీనా రోజాగా గుర్తించారు. ఆమె సుళ్లూరుపేటలో ఏఎన్ఎం శిక్షణ పూర్తి చేసుకుని ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో నరసాపురం రైల్వే స్టేషన్‌లో దిగి, తన స్వగ్రామానికి వెళ్లేందుకు ఓ కారును అద్దెకు మాట్లాడుకున్నారు. ప్రయాణ మధ్యలో వాటర్ బాటిల్ కొనుగోలు చేసేందుకు ఓ దుకాణం వద్ద కారు ఆపారు. అదే సమయంలో మార్గాని రమేశ్ అనే వ్యక్తి కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఇది గమనించిన కారు డ్రైవర్ సురేశ్, దుండగుడిని అడ్డుకునే ప్రయత్నంలో గాయపడ్డాడు. తీవ్ర గాయాలపాలైన టీనా రోజా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. గాయపడిన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దాడికి గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు.

# బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి 25 ఏళ్లు

**సోమవారం ఆసుపత్రిలో రజతోత్సవాలు**



హైదరాబాద్, జూన్ 21 (ఈవార్తలు): క్యాన్సర్ బాధితులకు తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయి వైద్యం అందించాలన్న మహోన్నత లక్ష్యంతో ఏర్పాటైన బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 25 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఈ చారిత్రక మైలురాయిని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ నోవోటెల్‌లో రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఆసుపత్రి ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తన అర్ధాంగి బసవతారకం జ్ఞాపకార్థం, ఆమె చివరి కోరిక మేరకు ఈ ఆసుపత్రి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. క్యాన్సర్ చికిత్స సామాన్యులకు అందుబాటులో ఉండాలనే సంకల్పంతో 1988లో ఈ బృహత్కార్యానికి అంకురార్పణ చేశారు. ప్రవాస భారతీయులు, వైద్య నిపుణులు, దాతల సహకారంతో ఏర్పాటైన ఈ ఆస్పత్రిని 2000 సంవత్సరంలో అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 100 పడకలతో ప్రారంభించారు. అప్పటి నుంచి నిరంతరాయంగా సేవలు విస్తరిస్తూ నేడు 650 పడకల సామర్థ్యంతో దేశంలోనే సమగ్ర క్యాన్సర్ చికిత్సాలయంగా పేరు పొందింది. ప్రస్తుతం ఈ ఆసుపత్రి బాలకృష్ణ ఛైర్మన్‌గా, మేనేజింగ్ ట్రస్టీగా వ్యవహరిస్తూ తండ్రి ఆశయాన్ని పవిత్ర యజ్ఞంగా కొనసాగిస్తున్నారు. ఆయన నాయకత్వంలో ఆసుపత్రి ఏటా 3 లక్షల మందికి పైగా అవుట్‌పేషెంట్లకు, 90 వేల మంది ఇన్‌పేషెంట్లకు సేవలందిస్తోంది. ఇక్కడ చికిత్స పొందుతున్న వారిలో 65 శాతానికి పైగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారే ఉండటం విశేషం. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి ప్రభుత్వ పథకాల ద్వారా కూడా వేలాది మందికి ఉచితంగా నాణ్యమైన వైద్యం అందుతోంది. ఇప్పటివరకు 8 వేలకు పైగా విజయవంతమైన క్యాన్సర్ సర్జరీలు, 86 బోన్ మ్యారో మార్పిడి చికిత్సలు ఇక్కడ నిర్వహించారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ఆసుపత్రి యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. అత్యాధునిక సదుపాయాలున్న మొబైల్ స్క్రీనింగ్ బస్సు ద్వారా మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. సర్జికల్, మెడికల్, రేడియేషన్ ఆంకాలజీ వంటి విభాగాల్లో సుమారు 250 మంది నిపుణులైన వైద్యులు సేవలందిస్తున్నారు. సోమవారం జరగనున్న రజతోత్సవ వేడుకలకు సీఎం చంద్రబాబుతో పాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు, వైద్య నిపుణులు, దాతలు హాజరై ఆసుపత్రి 25 ఏళ్ల సేవా ప్రయాణాన్ని స్మరించుకోనున్నారు.

# 'సాయికృష్ణ' కేసు దర్యాప్తునకు సిట్

విజయవాడ, జూన్ 21 (ఈవార్తలు): విజయవాడలో సంచలనం సృష్టించిన యువకుడి కస్టడీ మృతి ఆరోపణల కేసు దర్యాప్తును ప్రభుత్వం వేగవంతం చేసింది. 25 ఏళ్ల గాదె సాయికృష్ణ అదృశ్యం, కస్టడీ మృతి ఆరోపణలపై విచారణ జరిపేందుకు ఏపీ పోలీస్ శాఖ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. శాంతిభద్రతల విభాగం ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) ఎం. రవి ప్రకాశ్ ఈ సిట్‌కు నేతృత్వం వహించనున్నారు. ఈ ప్రత్యేక దర్యాప్తు బృందంలో పశ్చిమ గోదావరి ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ సభ్యులుగా ఉంటారని, బాపట్ల జిల్లా అదనపు ఎస్పీ ఎల్. సుధాకర్‌ను దర్యాప్తు అధికారిగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను వేగంగా పూర్తి చేసేందుకు అవసరమైన సిబ్బందిని, సాంకేతిక, ఫోరెన్సిక్ సహకారాన్ని పోలీస్ శాఖలోని వివిధ విభాగాల నుంచి తీసుకునేందుకు సిట్‌కు పూర్తి అధికారాలు కల్పించారు. ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న కృష్ణలంక పోలీస్ స్టేషన్ సస్పెండెడ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) నాగరాజు చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. అక్రమ నిర్బంధం, హత్య, సాక్ష్యాల ధ్వంసం వంటి ఆరోపణలపై సిట్ దర్యాప్తు చేయనుంది. మృతుడు సాయికృష్ణ తల్లి గాదె విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూన్ 19న సీఐ నాగరాజుపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 127(4), 127(6), 103(1), 238 కింద కేసు నమోదు చేశారు. సింగ్ నగర్‌లోని ఆయన నివాసంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు విచారణ జరుపుతున్నారు. విచారణ అనంతరం నాగరాజును అరెస్ట్ చేసే అవకాశం ఉంది.

## రైతులకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి: షర్మిల

విజయవాడ, జూన్ 21 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం రైతులను వంచిస్తోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'అన్నదాత సుఖీభవ' పథకం కింద అరకొర నిధులు విడుదల చేసి, వరుసగా మూడో ఏడాది కూడా రైతులకు అన్యాయం చేశారని ఆమె ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 20న 'అన్నదాత సుఖీభవ' పథకం కింద మొదటి విడత ఆర్థిక సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసింది. పీఎం-కిసాన్ పథకం నిధులతో కలిపి సుమారు 46.86 లక్షల రైతు కుటుంబాలకు ఈ ప్రయోజనం చేకూరింది. దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5,000, కేంద్రం వాటాగా రూ.2,000 కలిపి ప్రతి లబ్ధిదారుడికి మొత్తం రూ.7,000 చొప్పున అందాయి. ఈ నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా స్పందించిన షర్మిల, ప్రభుత్వాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. రాష్ట్రంలో దాదాపు 60 లక్షల మంది అర్హులైన రైతులు ఉండగా, కేవలం కొంతమందికి మాత్రమే నిధులు కేటాయించారంటూ ఆమె ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన పెట్టుబడి సాయం, కనీస మద్దతు ధర, పంటల బీమా వంటి వాగ్దానాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇచ్చిన మాట తప్పినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా, రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆమె సూచించారు.






లవ్యారి చిత్రం













# ఫిట్.. యోగా!

హైదరాబాద్, జూన్ 21: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పలువురు సినీ తారలు యోగాసనాలు చేస్తూ అభిమానులకు ఆరోగ్య సందేశాన్ని అందించారు. సోషల్ మీడియా వేదికగా తమ యోగా సాధనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను పంచుకుంటూ శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. దక్షిణాది, బాలీవుడ్‌కు చెందిన ప్రముఖ నటీనటులు ఉదయం యోగా సెషన్లలో పాల్గొని “యోగ ఫర్ హెల్తీ ఏజింగ్” అనే ఈ ఏడాది థీమ్‌కు మద్దతు తెలిపారు. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల శరీరం చురుకుగా ఉండటంతో పాటు ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరుగుతుందని వారు అభిమానులకు సూచించారు. కొంతమంది సెలబ్రిటీలు కుటుంబ సభ్యులతో కలిసి యోగా చేస్తూ ఫొటోలు పంచుకోగా, మరికొందరు ఫిట్‌నెస్‌కు యోగా ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సినీ ప్రముఖుల ఈ సందేశాలకు అభిమానుల నుంచి విశేష స్పందన లభించింది. తద్వారా యోగా ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరచుకోవాలనే అవగాహన మరింత పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా సెలబ్రిటీల భాగస్వామ్యం యువతకు స్ఫూర్తినిచ్చేలా నిలిచిందని ఫిట్‌నెస్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. “ఫిట్‌గా ఉండాలంటే యోగా తప్పనిసరి” అనే సందేశాన్ని వారు మరోసారి బలంగా వినిపించారు.







## దేశవాళీ క్రికెట్ వల్లే
# గెలిచాం: తిలక్ వర్మ

ముక్కోణపు వన్డే సిరీస్ ఫైనల్లో శ్రీలంక ఏ జట్టుపై ఘన విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకున్న అనంతరం భారత కెప్టెన్ తిలక్ వర్మ జట్టు ప్రదర్శనపై ప్రశంసలు కురిపించాడు. ప్రజెంటేషన్ వేడుకలో మాట్లాడిన తిలక్ వర్మ.. టోర్నీలో తమ ప్రయాణం అంత సులభంగా సాగలేదని గుర్తు చేసుకున్నాడు. ముఖ్యంగా గ్రూప్ దశలో ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక చేతుల్లో వరుసగా ఓడిపోయిన తర్వాత జట్టులోని ఆటగాళ్లంతా అద్భుతంగా రాణించారని చెప్పుకొచ్చాడు. ఆ పరాజయాల నుంచి పాఠాలు నేర్చుకుని భారీ తేడాతో మ్యాచ్‌లు గెలిచి ఫైనల్ చేరడం నిజంగా అద్భుతమని కొనియాడాడు. ఈ టోర్నీలో భారత్ అదరగొట్టడానికి గల సీక్రెట్ ఏంటని ప్రశ్నించగా.. తిలక్ వర్మ ఆసక్తికర సమాధానం ఇచ్చాడు. "మా జట్టులోని ఆటగాళ్లందరికీ దేశవాళీ క్రికెట్ ఆడిన మంచి అనుభవం ఉంది. మ్యాచ్‌కు ముందే మేము పక్కా ప్లానింగ్‌తో బరిలోకి దిగాం. పవర్‌ప్లేలో ఎలా ఆడాలి..10 నుంచి 40 ఓవర్ల మధ్య ఇన్నింగ్స్ ను ఎలా నిర్మించాలి, ఆ తర్వాత స్కోరును ఎలా వేగవంతం చేయాలనే దానిపై స్పష్టత ఉంది. డెత్ ఓవర్లలో మాకు మంచి హిట్టర్లు ఉన్నారనే నమ్మకం మాకు ఉంది. ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, ప్రియాన్ష్ ఆర్య ఇచ్చిన అద్భుతమైన ఆరంభం తర్వాత.. మిడిల్ ఓవర్లలో భాగస్వామ్యాలు నెలకొల్పడమే మా వ్యూహం. అదే ఈ రోజు వర్కవుట్ అయింది" అని కెప్టెన్ తిలక్ వర్మ వివరించాడు. ఈ సిరీస్ ద్వారా జట్టుగా ఏం నేర్చుకున్నారనే విషయంపై తిలక్ వర్మ కాస్త నిజాయితీగా స్పందించాడు. బ్యాటింగ్ విభాగం అంచనాలకు తగ్గట్టుగా రాణించినప్పటికీ.. బౌలింగ్ ప్రదర్శనపై తిలక్ వర్మ కొంత నిరాశను వ్యక్తం చేశాడు. "నిజం చెప్పాలంటే మాకు మంచి బౌలింగ్ అటాక్ ఉంది. కానీ ఈ టోర్నీలో మా బౌలింగ్ అనుకున్నంత స్థాయిలో లేదు. ఇలాంటి వన్-ఆఫ్ సిరీస్‌లలో కొన్నిసార్లు అలా జరుగుతుంటుంది. అందరికీ మంచి ప్రతిభ ఉంది కాబట్టి చివరికి ఫలితం మనకు అనుకూలంగా రావడం సంతోషమే. అయితే మేము గెలిచినా కూడా బౌలింగ్ విభాగంలో ఇంకా మెరుగుపరుచుకోవాల్సింది, నేర్చుకోవాల్సింది చాలా ఉంది" అంటూ తిలక్ వర్మ పేర్కొన్నాడు.



# యశస్వీకి మొండిచేయి

**కోహ్లీ, బుమ్రా రీ ఎంట్రీ.. ఇంగ్లాండ్ పర్యటనకు భారత జట్టు ప్రకటన**

ఇంగ్లండ్‌తో జరగనున్న వన్డే సిరీస్ కోసం బీసీసీఐ భారత జట్టును ప్రకటించింది. ఈ కీలక సిరీస్ కోసం సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా జట్టులోకి తిరిగి రావడం గమనార్హం. అయితే ఆఫ్ఘనిస్తాన్‌పై అద్భుత శతకంతో మెరిసిన యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను ఎంపిక చేయకపోవడం క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. జూలై 14 నుంచి ఇంగ్లండ్ గడ్డపై ఈ వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. విరాట్ కోహ్లీ ఎంపికైనప్పటికీ.. ఆయన తుది జట్టులో ఆడటం అనేది పూర్తి ఫిట్‌నెస్‌పైనే ఆధారపడి ఉంటుంది. ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో హ్యామ్‌స్ట్రింగ్ గాయానికి గురైన కోహ్లీ.. ఆఫ్ఘనిస్తాన్ వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. జూన్ 22న బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోహ్లీ కీలకమైన ఫిట్‌నెస్ పరీక్షకు హాజరుకావాల్సి ఉంది. ఈ పరీక్షలో విజయం సాధిస్తేనే అతను ఇంగ్లండ్ పర్యటనలో బరిలోకి దిగుతాడు. మరోవైపు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా సుదీర్ఘ విరామం తర్వాత వన్డే జట్టులోకి అడుగుపెడుతున్నాడు. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ తర్వాత బుమ్రా మళ్లీ వన్డే మ్యాచ్ ఆడలేదు. దాదాపు మూడేళ్ల సుదీర్ఘ విరామం అనంతరం బుమ్రా తిరిగి యాభై ఓవర్ల ఫార్మాట్‌లో బరిలోకి దిగుతుండటంతో భారత బౌలింగ్ విభాగం మరింత పటిష్టంగా మారింది. ఇంగ్లిష్ పరిస్థితుల్లో బుమ్రా స్పెల్స్ భారత్‌కు కీలకం కానున్నాయి. అయితే ఈ జట్టు ఎంపికలో అత్యంత ఆశ్చర్యకరమైన విషయం యశస్వి జైస్వాల్ చోటు దక్కకపోవడం. చెన్నై వేదికగా జరిగిన చివరి వన్డేలో కేవలం 86 బంతుల్లోనే 110 పరుగులతో అజేయ సెంచరీ సాధించిన జైస్వాల్‌కు జట్టులో చోటు దక్కలేదు. కోహ్లీ గాయపడటంతో జట్టులోకి వచ్చిన ఈ యువ బ్యాటర్, అద్భుత ప్రదర్శన చేసినా తదుపరి సిరీస్‌కు ఎంపిక కాకపోవడం అభిమానులను దిగ్భ్రాంతికి గురిచేసింది. భారత్ ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో శుభ్‌మన్ గిల్ సారథ్యంలో రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్ లాంటి భారీ బ్యాటింగ్ బలగం ఉంది.





## ఐవరీకోస్ట్‌పై జర్మనీ
# ఉత్కంఠ విజయం

**ఫిఫా ప్రపంచ కప్ 2026 గ్రూప్ దశ మ్యాచ్‌లో జర్మనీ ఉత్కంఠభరిత విజయాన్ని నమోదు చేసింది. టొరంటో వేదికగా ఐవరీకోస్ట్‌తో జరిగిన ఈ థ్రిల్లర్ మ్యాచ్‌లో జర్మనీ 2-1 తేడాతో విజయం సాధించి టోర్నీలో తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది. సబ్‌స్టిట్యూట్‌గా స్టేడియంలోకి వచ్చిన డెనిజ్ ఉండావ్ రెండు అద్భుతమైన గోల్స్ చేసి జర్మనీని గెలిపించి రియల్ హీరోగా నిలిచాడు.**

**జర్మనీ కోచ్ జూలియన్ నాగెల్స్‌మన్ సెకండాఫ్‌లో చేసిన వ్యూహాత్మక మార్పులు ఈ మ్యాచ్ ఫలితాన్ని పూర్తిగా మార్చేశాయి. మ్యాచ్ ప్రారంభంలో 4 సార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన జర్మనీ పటిష్టమైన ఆటతీరును ప్రదర్శించింది.**

29వ నిమిషంలో ఐవరీకోస్ట్ అనూహ్యంగా తొలి గోల్ చేసి జర్మనీకి షాకిచ్చింది. ఆ జట్టు ఆటగాడు ఫ్రాంక్ కేసీ లభించిన రీబౌండ్ అవకాశాన్ని చక్కగా ఉపయోగించుకుని బంతిని నెట్‌లోకి పంపాడు. దీంతో ఐవరీకోస్ట్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. జర్మనీ జట్టు ఫస్ట్ హాఫ్‌లో గోల్స్ చేయడానికి ప్రయత్నించినప్పటికీ.. ఐవరీ కోస్ట్ డిఫెన్స్‌ను ఛేదించలేకపోయింది. దీంతో సగం ఆట ముగిసేసరికి ఐవరీ కోస్ట్ ఆధిక్యంలో నిలిచింది. సెకండాఫ్‌లో జర్మనీ కోచ్ నాగెల్స్‌మన్ 60వ నిమిషంలో డెనిజ్ ఉండావ్, నాడీమ్ అమిరిలను సబ్‌స్టిట్యూట్‌లుగా మైదానంలోకి దించి మాస్టర్ స్ట్రోక్ ఆడారు. ఈ మార్పు జర్మనీ ఆటలో కొత్త వేగాన్ని తెచ్చింది. 68వ నిమిషంలో అమిరి అందించిన అద్భుతమైన క్రాస్‌ను ఉండావ్ గోల్‌గా మలిచి స్కోరును 1-1తో సమం చేశాడు. వరల్డ్ కప్ చరిత్రలో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చి అత్యధిక ఇంపాక్ట్ చూపిన రెండో ఆటగాడిగా ఉండావ్ ఈ గోల్‌తో రికార్డు సృష్టించాడు. మ్యాచ్ డ్రా వైపు సాగుతున్న తరుణంలో ఇరు జట్లు విజయం కోసం హోరాహోరీగా తలపడ్డాయి. ఐవరీకోస్ట్ ఆటగాడు అడింగ్రాకు 88వ నిమిషంలో గోల్ చేసే సువర్ణావకాశం లభించినప్పటికీ.. అతను దానిని చేజార్చుకున్నాడు. ఇక ఇంజురీ సమయంలో (90ం4వ నిమిషంలో) ఎన్‌మెచా అందించిన త్రూ-బాల్‌ను అద్భుతమైన నియంత్రణతో అందుకున్న డెనిజ్ ఉండావ్.. ఐవరీకోస్ట్ గోల్ కీపర్‌ను పక్కదారి పట్టిస్తూ జర్మనీకి విజయభేరి మోగించిన రెండో గోల్ అందించాడు. ఈ అద్భుత విజయంతో జర్మనీ గత రెండు ప్రపంచకప్‌ల నాకౌట్ గండం నుంచి బయటపడింది. గత రెండు ఎడిషన్లలో గ్రూప్ స్టేజ్ దాటలేకపోయిన జర్మనీ, ఈసారి ఈ గెలుపుతో నాకౌట్ స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. జర్మనీ తరఫున ఆడిన 11 మ్యాచ్‌ల్లో 8 గోల్స్, 4 అసిస్ట్‌లతో అదరగొడుతున్న ఉండావ్.. ఈక్వెడార్‌తో జరగబోయే తదుపరి మ్యాచ్‌లో స్థానం కోసం సిద్ధమైనట్లు తెలిసింది. మరోవైపు ఐవరీ కోస్ట్ తదుపరి రౌండ్ చేరాలంటే కురాకోపై ఖచ్చితంగా గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# దక్షిణాఫ్రికా చేతిలో భారత్ ఓటమి

మహిళల టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నీలో భారత మహిళా జట్టు అజేయ రథానికి బ్రేక్ పడింది. మాంచెస్టర్‌లోని ప్రతిష్టాత్మక ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరిగిన 18వ లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా మహిళల జట్టు చేతిలో టీమిండియా 6 వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ టోర్నీలో వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచి జోరుమీదున్న భారత జట్టుకు ఇది మొదటి ఓటమి కాగా, దక్షిణాఫ్రికా జట్టుకు ఇది వరుసగా రెండో విజయం కావడం విశేషం. ఈ చారిత్రాత్మక మ్యాచ్‌తో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తన కెరీర్‌లో 200వ అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడి సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ మైల్‌స్టోన్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన హర్మన్‌ప్రీత్ మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే దక్షిణాఫ్రికా బౌలర్లు కట్టుదిట్టమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేస్తూ ప్రారంభంలోనే భారత టాప్ ఆర్డర్‌ను దెబ్బతీశారు. దీంతో టీమిండియా పవర్‌ప్లేలోనే కీలక వికెట్లు కోల్పోయి కాస్త ఒత్తిడిలో పడింది. తొలినాళ్లలోనే వికెట్లు పడిపోయినప్పటికీ, భారత మిడిల్ ఆర్డర్, లోయర్ ఆర్డర్ బ్యాటర్లు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ఏ ఒక్క బ్యాటర్ కూడా భారీ ఇన్నింగ్స్ లేదా హాఫ్ సెంచరీ చేయలేకపోయినప్పటికీ.. జట్టులోని ప్రతి ఒక్కరూ తమ వంతుగా చిన్న చిన్న కీలక భాగస్వామ్యాలు నెలకొల్పారు. దీనివల్ల భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 పరుగుల గౌరవప్రదమైన స్కోరు సాధించింది. సౌతాఫ్రికా ముందు 159 పరుగుల సవాల్‌తో కూడిన లక్ష్యాన్ని ఉంచింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత జట్టు ప్రత్యర్థి ముందు 159 పరుగుల గౌరవప్రదమైన లక్ష్యాన్ని ఉంచింది. అయితే 159 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన సౌతాఫ్రికా మహిళల జట్టు ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. 159 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన సౌతాఫ్రికా మహిళల టీమ్‌కు ప్రారంభంలోనే గట్టి షాక్ తగిలింది. కేవలం 25 పరుగులకే ఆ జట్టు 2 వికెట్లు కోల్పోయింది. అయితే ఆ దశలో సౌతాఫ్రికా బ్యాటర్లు ఇన్నింగ్స్‌ను ఎంతో అద్భుతంగా చక్కదిద్దారు. ఆ జట్టు బ్యాటర్లు భారత బౌలింగ్ ఎటాక్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటూ, ఎక్కడా లూజ్ షాట్లకు తావివ్వకుండా చాలా



సులువుగా లక్ష్యాన్ని ఛేదించారు. దక్షిణాఫ్రికా జట్టులో మారిజాన్ కాప్ 81 పరుగుల విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయతీరాలకు చేర్చింది. 19.1 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసి సౌతాఫ్రికా ఘన విజయం సాధించింది. టీమిండియా బౌలర్లలో 3 వికెట్లు పడగొట్టి శ్రీచరణి సౌతాఫ్రికా బ్యాటర్లను కాస్త కట్టడి చేసింది. కానీ అది భారత పరాజయాన్ని ఆపలేకపోయింది. 159 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన సౌతాఫ్రికా మహిళల టీమ్‌కు ప్రారంభంలోనే గట్టి షాక్ తగిలింది. కేవలం 25 పరుగులకే ఆ జట్టు 2 వికెట్లు కోల్పోయింది. అయితే ఆ దశలో సౌతాఫ్రికా బ్యాటర్లు ఇన్నింగ్స్‌ను ఎంతో అద్భుతంగా చక్కదిద్దారు. మంచి ఫామ్‌లో ఉన్న భారత మహిళల జట్టు ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా బ్యాటింగ్ పవర్ ముందు పూర్తిగా తేలిపోయింది. కట్టుదిట్టమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేయడంలో భారత బౌలర్లు విఫలం కావడంతో మ్యాచ్ పూర్తిగా చేజారిపోయింది. ఈ ఓటమితో టీమిండియా టోర్నమెంట్‌లో తమ మొదటి పరాజయాన్ని నమోదు చేయగా, రాబోయే మ్యాచ్‌ల్లో సెమీఫైనల్ రేసులో నిలవాలంటే భారత్ తన తదుపరి పోరులో ఖచ్చితంగా పుంజుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



# ఈక్వెడార్‌కు క్యూరాసావ్ షాక్

ఫిఫా ప్రపంచకప్ టోర్నీలో సరికొత్త సంచలనం నమోదైంది. టోర్నమెంట్ లో తొలిసారి అడుగుపెట్టిన పసికూన క్యూరాసావ్ జట్టు బలమైన ఈక్వెడార్ జట్టును నిలువరించి మెగా టోర్నీ చరిత్రలోని తన మొట్టమొదటి ప్రపంచ కప్ పాయింట్‌ను తన ఖాతాలో వేసుకుంది. కాన్సాస్ సిటీ స్టేడియంలో జరిగిన గ్రూప్-ఈ ఉత్కంఠభరిత పోరులో క్యూరాసావ్ 0-0తో ఈక్వెడార్ జట్టుపై మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. క్యూరాసావ్ గోల్‌కీపర్ ఎలోయ్ రూమ్ ఆకాశమే హద్దుగా చెలరేగి ఏకంగా 15 సార్లు గోల్ సేవ్ చేయడంతో ఈక్వెడార్ జట్టుకు తీవ్ర నిరాశే మిగిలింది. ఈ ఫలితంతో గ్రూప్-ఈలో ఐవరీకోస్ట్‌పై విజయం సాధించిన జర్మనీ జట్టు అగ్రస్థానాన్ని ఖరారు చేసుకుంది. మ్యాచ్ ప్రారంభమైన మూడో నిమిషం నుంచే ఈక్వెడార్ జట్టు మ్యాచ్‌పై పట్టు సాధించేందుకు ప్రయత్నించింది. మోయిసెస్ కైసెడో అందించిన పాస్‌ను అందుకుని ఈక్వెడార్ స్టార్ ప్లేయర్ ఎన్నర్ వాలెన్సియా కొట్టిన బలమైన షాట్ ను క్యూరాసావ్ కీపర్ ఎలోయ్ రూమ్ అద్భుత డైవ్‌తో తిప్పికొట్టాడు. ఆ తర్వాత కూడా ఈక్వెడార్ ఫార్వర్డ్ ఆటగాళ్లు జాన్ యెబోవా, పీరో హింకాపియే సృష్టించిన అవకాశాలను రూమ్ ఒక్కడే ఒంటిచేత్తో అడ్డుకున్నాడు. హాఫ్ టైమ్ ముగిసే సమయానికి ఈక్వెడార్ ఎన్ని సార్లు ప్రయత్నించినా క్యూరాసావ్ డిఫెన్స్ విభాగాన్ని, ముఖ్యంగా కీపర్ రూమ్‌ను దాటలేకపోయాయి. తర్వాత కూడా ఈక్వెడార్ ఒత్తిడిని మరింతగా పెంచేసింది. గొంజాల్లో ప్లాటా హెడర్‌ను రూమ్ అడ్డుకున్న తరుణంలో, క్యూరాసావ్ జట్టుకు లభించిన ఎదురుదాడి అవకాశాన్ని ఈక్వెడార్ కీపర్ హెర్నాన్ గాలిండెజ్ సమర్థవంతంగా అడ్డుకున్నాడు. క్యూరాసావ్ ఆటగాళ్లు లివానో కొమెనెంసియా, లియాండ్రో బాకునా వేసిన షాట్లను గాలిండెజ్ కాపాడాడు.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# తప్పుడు మాటలు.. తప్పని తిప్పలు

**ఇంటర్నెట్,** స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా విస్తరణతో ప్రపంచం మన అరచేతిలోకి వచ్చేసింది. సమాచారం క్షణాల్లో ప్రపంచమంతా వ్యాపిస్తోంది. ఈ పరిణామం జ్ఞానాన్ని ప్రజలకు చేరువ చేసినప్పటికీ, అదే సమయంలో మరో ప్రమాదకరమైన ధోరణికి కూడా దారితీసింది–తప్పుడు సమాచారం (మిస్‌ఇన్‌ఫర్మేషన్) మరియు ఉద్దేశపూర్వకంగా వ్యాప్తి చేసే దుష్ప్రచారం (డిస్‌ఇన్‌ఫర్మేషన్). నేటి డిజిటల్ యుగంలో అబద్ధాలు నిజాల కంటే వేగంగా వ్యాపిస్తున్నాయి. ఈ పరిస్థితి ప్రజాస్వామ్యం, ప్రజారోగ్యం, సామాజిక సామరస్యం, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఒకప్పుడు వార్తలను పత్రికలు, రేడియో, టెలివిజన్ వంటి సంప్రదాయ మాధ్యమాలు సేకరించి, ధృవీకరించి ప్రజలకు అందించేవి. ఇప్పుడు సోషల్ మీడియా వేదికలపై ఎవరైనా ఏ సమాచారమైనా క్షణాల్లో ప్రచారం చేయగలుగుతున్నారు. నిజానిజాలు పరిశీలించకుండా లక్షలాది మంది దానిని షేర్ చేయడం వల్ల తప్పుడు వార్తలు వైరల్‌గా మారుతున్నాయి. ముఖ్యంగా సంచలనాత్మక శీర్షికలు, భావోద్వేగాలను రెచ్చగొట్టే పోస్టులు, మార్ఫింగ్ చేసిన చిత్రాలు, ఎడిట్ చేసిన వీడియోలు ప్రజలను సులభంగా తప్పుదోవ పట్టిస్తున్నాయి. కృత్రిమ మేధ అభివృద్ధితో ఈ సమస్య మరింత సంక్లిష్టమైంది. డీప్‌ఫేక్ వీడియోలు, నకిలీ ఆడియోలు, నిజమైనట్లే కనిపించే చిత్రాలు సృష్టించడం ఇప్పుడు చాలా సులభమైంది. ప్రముఖులు చెప్పని మాటలను చెప్పినట్లుగా చూపించడం, జరగని సంఘటనలను జరిగినట్లుగా ప్రచారం చేయడం ద్వారా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే ప్రమాదం పెరిగింది. ఎన్నికల సమయంలో, సామాజిక ఉద్రిక్తతల సమయంలో లేదా ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఇటువంటి తప్పుడు సమాచారం తీవ్ర పరిణామాలకు దారితీయవచ్చు. ఆరోగ్య రంగంలోనూ మిస్‌ఇన్‌ఫర్మేషన్ ముప్పు స్పష్టంగా కనిపిస్తోంది. వైద్యపరమైన ఆధారాలు లేని చికిత్సలు, నకిలీ మందులు, అపోహల ఆధారంగా ప్రచారం చేసే సందేశాలు ప్రజల ప్రాణాలకే ప్రమాదం కలిగించగలవు. అలాగే ఆర్థిక రంగంలో కంపెనీల గురించి తప్పుడు వార్తలు వ్యాపిస్తే పెట్టుబడిదారులు నష్టపోయే అవకాశం ఉంది. బ్యాంకులపై వదంతులు, షేర్ మార్కెట్‌పై అసత్య ప్రచారం కూడా తీవ్ర ప్రభావం చూపగలవు. ఈ సమస్యకు ప్రధాన కారణాల్లో ఒకటి మన మనస్తత్వం. మన అభిప్రాయాలకు అనుకూలంగా ఉన్న సమాచారాన్ని సులభంగా నమ్మే స్వభావం చాలా మందిలో ఉంటుంది. భావోద్వేగాలకు లోనై ధృవీకరణ లేకుండానే పోస్టులను ఫార్వర్డ్ చేస్తారు. సోషల్ మీడియా అల్గోరిథమ్‌లు ఎక్కువ స్పందన పొందే కంటెంట్‌ను మరింత మందికి చూపించడం వల్ల తప్పుడు సమాచారం మరింత వేగంగా వ్యాప్తి చెందుతుంది. ఈ సవాలును ఎదుర్కోవడంలో టెక్నాలజీ సంస్థలకు, ప్రభుత్వాలకు, మీడియాకు, ప్రజలకు సమాన బాధ్యత ఉంది. సోషల్ మీడియా సంస్థలు నకిలీ ఖాతాలను గుర్తించడం, తప్పుడు సమాచారాన్ని గుర్తించే సాంకేతికతలను మెరుగుపరచడం, పారదర్శక విధానాలు అవలంబించడం అవసరం. ప్రభుత్వాలు కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. అయితే ఆ చర్యలు భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం కలిగించకుండా, ప్రజాస్వామ్య విలువలను కాపాడేలా ఉండాలి. అంతకంటే ముఖ్యమైనది డిజిటల్ అక్షరాస్యత. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సమాచారాన్ని ఎలా ధృవీకరించాలి, మూలాలను ఎలా పరిశీలించాలి, ఫేక్ న్యూస్‌ను ఎలా గుర్తించాలి అనే విషయాలపై అవగాహన కల్పించాలి. ప్రజలు ఏ సమాచారాన్నైనా వెంటనే నమ్మకుండా, కనీసం రెండు మూడు విశ్వసనీయ వనరులతో సరిపోల్చి చూసే అలవాటు పెంపొందించుకోవాలి. "ఫార్వర్డ్ చేసే ముందు ఆలోచించండి" అనే సంస్కృతి సమాజంలో బలపడాలి. సంప్రదాయ మీడియా కూడా తన విశ్వసనీయతను మరింత పెంచుకోవాలి. వేగం కంటే వాస్తవ నిర్ధారణకు ప్రాధాన్యం ఇవ్వాలి. పొరపాట్లు జరిగినప్పుడు పారదర్శకంగా సరిదిద్దాలి. బాధ్యతాయుతమైన జర్నలిజమే తప్పుడు సమాచారాన్ని ఎదుర్కొనే ప్రధాన ఆయుధం. డిజిటల్ యుగం మనకు అపారమైన అవకాశాలను అందించింది. అదే సమయంలో సమాచారాన్ని బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన బాధ్యతను కూడా అప్పగించింది. తప్పుడు సమాచారాన్ని అరికట్టడం ఒక్క ప్రభుత్వాల పని కాదు, ఒక్క మీడియా పని కాదు, ఒక్క సాంకేతిక సంస్థల పని కూడా కాదు. ప్రతి పౌరుడు తన పాత్రను గుర్తించి, నిజానిజాలను తెలుసుకుని మాత్రమే సమాచారాన్ని పంచుకుంటేనే ఈ సమస్యను సమర్థంగా ఎదుర్కోగలం.

# దేవ రహస్యం





కోవెల సంతోష్ కుమార్
రచయిత, 91 90521 16463

**(..తరువాయి భాగం)**

ఆయుధాలు, విమానాల తయారీ గురించి మన పూర్వీకులు గ్రహాంతర వాసుల నుంచే నేర్చుకున్నారని ఊహించవచ్చు. రాతియుగం నాటి ఆనవాళ్లలో చిత్ర విచిత్ర ఆకారాలు, ఆయుధాలు కనిపించటం, వాహనాల్లో తిరగడాన్ని సూచిస్తున్నాయి. ఇప్పుడు అడపాదడపా రోదసి నుంచి భూమ్మీదకు వస్తున్నాయంటున్న ఏలియన్స్, యుఎఫ్‌ఎలు కూడా ఇదే విధంగా కనిపిస్తున్నాయి.. వీటి మర్మమేమిటి? అత్యంత వేగంగా జెట్ ఇంజన్తో రోదసిలోకి వెళ్లి రాగల విమానాలను మనవాళ్లు తయారు చేసినట్లు చూశాం.. అంటే ఆనాడే ఇతర గ్రహాలకు మనుషులు పయాణించారా? క్రిస్టియానిటీ చిత్రాలలో శాటిలైట్ వంటి యంత్రం పక్కన జీసస్ కూర్చుని ఉన్నట్లు కనిపిస్తుంది. ఈ యంత్రం అచ్చంగా స్పుత్నిక్ ఉపగ్రహం లాగానే ఉంటుంది. అంటే రోదసిలో ఉన్న గ్రహాంతర వాసులతో మొదటి నుంచి భూమి మీద ఉన్న వారికి సంబంధాలు ఉన్నాయని భావించవచ్చు. అయితే ఈ సంబంధాలు ఎప్పుడు ఎలా దెబ్బ తిన్నాయనేది అర్థం కాదు.. చాలా కాలం తరువాత తిరిగి ఏలియన్స్ కనిపిస్తున్నాయి. చాలా మంది తాము ఫ్లైయింగ్ సాసర్లను చూశామని చెప్తున్నారు. దేవతలంటే గ్రహాంతర వాసులని కొందరంటారు.. వాళ్లు గ్రహాంతర వాసులు కారు.. దేవతలేనని ఆస్తికులంటారు.

అలాంటి గ్రహాంతరవాసులు మొదట్నుంచీ భూమితో చెలిమి చేస్తూ వచ్చారా? వాళ్ల జీవిత కాలానికీ, మన జీవిత కాలానికీ ఏదైనా తేడా ఉందా? వారికి ఉన్న అపురూపమైన శక్తి సామర్థ్యాలను, టెక్నాలజీని మనుషులతో పంచుకున్నారా? అవుననే అనిపిస్తుంది.. ఎందుకంటే రామాయణ, భారత, క్రీస్తు కాలాలలో మన సమాజంలో కనిపించే అపూర్వ టెక్నాలజీకి, ఏలియన్స్ టెక్నాలజీకి దగ్గరి సంబంధం ఉన్నట్లు కనిపిస్తుంది. ఆనాటి విమానాలు కానీ, ఆయుధాలు కానీ, మన కాలానికి ఎన్నో రెట్లు అడ్వాన్స్ స్టేజిలో ఉన్నట్లు తెలుస్తుంది. మన పురాణాల్లో ఖగోళంలో ఏ గ్రహం ఎంతకాలానికి ఎంత దూరం ఏ విధంగా ప్రయాణం చేస్తుందో లెక్కించారు.. సూర్య, చంద్ర గ్రహణాలు ఎప్పుడు వస్తాయో ఖచ్చితంగా చెప్పగలిగారు.. అంతే కాదు.. దేవతలకూ, మనుషుల జీవిత కాలాలకు సంబంధించిన లెక్కలు కట్టారు.. ఇవన్నీ ఎలా సాధ్యమయ్యాయి? ఏ ప్రాతిపదికన మన వాళ్లు ఈ లెక్కలు వేయగలిగారు? భాగవత పురాణంలో బ్రహ్మ జీవిత కాలాన్ని మనుషుల జీవిత కాలంతో పోలుస్తూ వ్యాసుడు కట్టిన లెక్కలు కనిపిస్తాయి. దీని ప్రకారం, 360 మనిషి సంవత్సరాలు దేవతలకు ఒక సంవత్సరం. 12 వేల దేవతల సంవత్సరాలు ఒక చతుర్యుగం.. అంటే కృత, త్రేత, ద్వాపర కలియుగాలన్నమాట. మన మనుషుల లెక్క ప్రకారం ఒక చతుర్యుగం అంటే 4లక్షల 32 వేల సంవత్సరాలన్నమాట. ఇలాంటి చతుర్యుగాలు 2000 పూర్తయితే బ్రహ్మకు ఒక రాత్రి, పగలు అన్నమాట.. అంటే ఒక రోజు గడిచినట్లు. బ్రహ్మకు ఇలాంటి రోజులు 360 గడిస్తే ఒక సంవత్సరం అయినట్లు. ఇలాంటి సంవత్సరాలు వంద పూర్తయితే బ్రహ్మ జీవిత కాలం ముగిసినట్లు.. అంటే మన మనుష్యుల కాలమానం ప్రకారం బ్రహ్మ జీవించే కాలం అక్షరాలా 3,11,040,000,000 రోజులన్నమాట. దీని తరువాత ప్రళయం వస్తుందని, ఆ తరువాత మళ్లీ సృష్టి మొదలవుతుందని భాగవతం చెప్తోంది. ఈ లెక్కల ప్రకారం దేవతలు అమరులనటంలో ఆశ్చర్యం లేదు.. ఎందుకంటే మనతో పోలిస్తే 36వేల సంవత్సరాలు గడిస్తే తప్ప వాళ్లకు వందేళ్లు పూర్తి కావు.. అయితే ఈ కాలమానాన్ని మన వాళ్లు ఎలా లెక్క కట్టగలిగారు అన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లభించకపోవచ్చు. కానీ ఖగోళ శాస్త్రాన్ని, నక్షత్రాల కదలికలను అంచనా వేయటంలో ఆరితేరిన వారు కాబట్టి ఇతర గ్రహాలలో ఉండే జీవరాశుల జీవిత కాలాన్ని ఈ విధంగా లెక్కించి వుండవచ్చు. పురాణాల్లో చెప్పినట్లు భూమికి ఎగువన ఉన్న లోకాల్లో సత్యలోకం అన్నింటి కంటే పైన ఉన్నది.. బ్రహ్మ ఉండేది కూడా సత్యలోకంలోనే. అంటే భూమి నుంచి ఎగువన ఉన్న గ్రహాల వైపు వెళ్తున్న కొద్దీ కాల గమనంలో మార్పు వస్తుందన్న మాట. రోదసి.. అనంతమైన విశ్వం.. మొదలెక్కడో తెలియదు.. తుది ఏమిటో అంతకంటే తెలియదు. ఈ విశ్వాంత రాళంలో భూమి పరిమాణం చాలా చాలా చాలా చిన్నది.. దీనికి ఎన్నో రెట్లు పెద్దవైన గ్రహాలు రోదసిలో కోట్ల సంఖ్యలో ఉన్నాయి.. వీటిలో ఎక్కడో భూమిలాంటి గ్రహం ఉండి ఉండవచ్చు. అక్కడా మనలాగే జీవరాశి ఉండనూ వచ్చు.. స్పేస్లో పాలపుంతలు ఒకటి కాదు.. వేల సంఖ్యలో ఉన్నాయి. సౌరమండలాలకు లెక్కలేదు.. దూరాలకు అంతే లేదు. మన సౌర మండలమే దాదాపు 14 వందల కోట్ల మైళ్ల మేర ఉంది. దాని తరువాత మిల్కీవేల గురించి చెప్పేదేముంది.. భూమి కంటే ఎంతో పెద్దవైన గ్రహాలు మన సూర్యుడి కంటే ఎన్నో రెట్లు పెద్దవైన సూర్యుల చుట్టూ తిరుగుతూ ఉండవచ్చు.. అందుకే దేవతల కాలమానానికి, మన కాలమానానికి తేడా ఉంది. ఒక దేశానికి, ఇంకో దేశానికీ మధ్యనే టైమ్లో చాలా తేడా కనిపిస్తుంది మనకు. ఇక రోదసిలో గ్రహాల మధ్య కాలంలో డిఫరెన్స్ ఉండటంలో ఆశ్చర్యమేముంది? గ్రహాల మధ్య దూరం, గ్రహాల మధ్య భ్రమణాన్నిబట్టి ఆయా గ్రహాలలో ఉండే జీవరాశుల జీవిత కాలాన్ని మన వాళ్లు అంచనా వేశారు. ఈ విధంగానే వారి శక్తి సామర్థ్యాలనూ ఏ స్థాయిలో ఉంటాయో రుచి చూశారు. ఇదిగో ఇవాళ ఏలియన్లు తిరుగుతున్నాయంటున్న యుఎఫ్లు, నాడు దేవతలు తిరిగారంటున్న పుష్పక విమానం ఒకటే కావచ్చని పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తల్లో కొందరి అభిప్రాయం.

ఈజిప్ట్, ప్రపంచంలో అత్యంత ప్రాచీన నాగరికత ఉన్న దేశం.. ఇక్కడ బయటపడ్డ పిరమిడ్లు అనేక చారిత్రక రహస్యాలను విప్పి చెప్తాయి. ఇక్కడి కింగ్ జోసెఫ్ పిరమిడ్ నాలుగు వేల సంవత్సరాల నాటిది. ఇక్కడ తవ్వకాలు జరుపుతున్నప్పుడు చిన్న చెక్కతో తయారు చేసిన పక్షి బొమ్మ దొరికింది. అక్కడ కనిపించిన రాతల్లో ఐ వాంట్ టు ఫ్లై అన్న మాటలూ వున్నాయి. ఈ బొమ్మను నిశితంగా గమనిస్తే, దానికి పక్షిలాగా కళ్లు రెక్కలు ఉన్నాయి. కానీ, రెక్కలు సాధారణ పక్షికి ఉన్నట్లు కాకుండా విమానపు రెక్కలను తలపిస్తున్నాయి. ఆధునిక ఎయిర్క్రాఫ్ట్కు ఇది నమూనాలాగా ఉంది.

అటు కొలంబియాలో దొరికిన ప్రాచీన ఆనవాళ్లలో సైతం చేప ఆకారంలో ఉన్న అనేక వస్తువులు ఉన్నాయి. ఇవన్నీ మోడర్న్ ఎయిర్ షిప్కు సంకేతంగా భావిస్తున్నారు. మన దేశంలో సంస్కృత గ్రంథాల్లో, శాసనాల్లో విమాన శాస్త్రం ఉంది. క్రీస్తుకు పూర్వం దాదాపు 6వేల సంవత్సరాల క్రితమే భారతీయులు విమానాన్ని తయారు చేసే ప్రక్రియను కనుక్కున్నారు. ఈ విమానాల్లో కొన్ని ఒక విధమైన జెట్ ఇంజన్తో నడిచేవని శాస్త్రవేత్తలు చెప్తారు.. ఈ విమానాలు గాల్లోకి ఎగిరే సమయంలో తీవ్రవేగంతో, భారీ ఇంధన వినియోగంతో, పేలుళ్లు జరిగేవని అంటారు.. ఒక్క మాటలో చెప్పాలంటే ఆధునిక యుగంలో అంతరిక్షంలోకి ప్రయోగించే ఉపగ్రహ వాహక నౌకల్లాంటివే ఇవి. ఈ విమానాల్లో ఎలక్ట్రిసిటీ పవర్ ఉండేదిట.. ఇందుకోసం మెర్క్యురీని ఇంధనంగా వాడేవారు.. ఇందులో ప్రయాణికులకు చోటు ఉన్నట్లే.. వార్హెడ్ కూడా ఉండేది. ఈ విమానం ద్వారా ఆయుధాన్ని కూడా ప్రయోగించే వీలుంది.. ఆధునిక మిలటరీ విమానానికి భారతీయ విమాన శాస్త్రంలో చెప్పిన విమానాలు ఎంతమాత్రం తీసిపోవని శాస్త్రవేత్తలే అంటున్నారు. పుష్పక విమానం కూడా ఇలాంటిదే.. రెండు అంతస్థుల్లో ప్రయాణికులను తీసుకుని వెళ్లగలిగే సామర్థ్యం ఉన్న అతి పెద్ద విమానం ఇది. రావణవధ తరువాత రాముడు ఇదే విమానంలో అయోధ్యకు లంక నుంచి వెళ్లాడట. ఇంత టెక్నాలజీ మన వారికి అంత ప్రాచీన కాలంలో ఎలా లభించింది.. అన్న ప్రశ్నకు జవాబే ఫ్లైయింగ్ సాసర్.. ఎలియాస్ యుఎఫ్ఎ. గత అర్థ శతాబ్దంలో ప్రపంచంలో చాలా చోట్ల లిప్తపాటులో కనిపించి వెళ్లిపోతున్న ఫ్లైయింగ్ సాసర్లోని టెక్నాలజీ, మన విమానాల్లో వినియోగించిన పరిజ్ఞానమూ దాదాపు ఒకటేనన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇది పూర్తిగా నిర్ధారణ కాకపోయినప్పటికీ ఈ దిశగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇవి రెండు ఒకటే అయితే, గ్రహాంతర వాసులతో మన ప్రాచీనులకు ఉన్న అనుబంధం స్పష్టమవుతుంది. దేవతలు అనగానే మనకు గుర్తొచ్చేది వారి చేతుల్లో ఉండే వివిధ ఆయుధాలు.. కత్తులు, గదలు, బాణాలు, ఇంకా రకరకాలు. ఈ అస్త్రాలతోనే దేవతలు బీభత్సాన్ని సృష్టించారా? అంటే అవుననే చెప్పాలి. ఇవి సాధారణ ఆయుధాలు కావు.. సామూహిక జనహననాన్ని సృష్టించే భయానక అస్త్రాలు.. 1945 జులై 16న మెక్సికో సరిహద్దుల్లో అమెరికా అణ్వస్త్ర ప్రయోగాన్ని సక్సెస్ఫుల్గా జరిపింది. దాదాపు వంద మైళ్ల ఎత్తున అ రేడియో ధార్మికత ఎగిసిపడింది. అమెరికా అణ్వస్త్రాన్ని 1945లో ప్రయోగించింది. కానీ, దానికంటే ఎన్నో ఏళ్ల క్రితం అంటే ప్రాచీన కాలంలోనే, ముఖ్యంగా భారతదేశంలో అణ్వస్త్రాలు వున్నాయనటానికి ఆధారాలు ఉన్నాయి. కృత యుగంలో జరిగిన రావణుడితో యుద్ధం చేసిన రాముడు అతనిపై రామబాణాన్ని ప్రయోగించి వధించాడు.. అది న్యూక్లియర్ పవర్ ఉన్న బాంబుగా భావిస్తున్నారు.. ఎందుకంటే లంకలో రామ రావణ యుద్ధం ఎక్కడైతే జరిగిందని భావిస్తున్నారో, అక్కడ ఇవాళికీ గడ్డి పరక కూడా మొలవదు. అంతే కాదు.. మహాభారత యుద్ధంలో మన వారి చేతుల్లో బ్రహ్మాస్త్రం ఉండేది.. అదే అణ్వస్త్రమని ఇప్పటి శాస్త్రవేత్తల అభిప్రాయం.. భారత ఇతిహాసాల్లో ఎగిరే రథాలు కనిపిస్తాయి. వాటిపై యుద్ధం చేస్తున్నవారి చేతుల్లో అపూర్వమైన ఆయుధాలు కనిపిస్తాయి. అటు క్రిస్టియానిటీ ప్రాచీన గ్రంథాల్లోనూ, బైబిల్లోనూ ఈ న్యూక్లియర్ పవర్ గురించిన ప్రస్తావన కనిపిస్తుంది. దేవతలు, గ్రహాంతర వాసులు ఒకరే. ఎందుకంటే భూమిపై నివసించని వారంతా గ్రహాంతర వాసులే. దేవతలు ఎలా ఉంటారు. వారి శక్తి సామర్థ్యాలు ఏ స్థాయిలో ఉన్నాయన్న దానిపైనా, ఖగోళ శాస్త్రంపై, గ్రహాలు, జీవరాశులపైనా ప్రాచీన కాలంలోనే అనేక పరిశోధనలు జరిగినట్లు స్పష్టమవుతోంది. ఆనాటి ఆనవాళ్లను ఆసరా చేసుకుని ముందుకు పోగలిగితే ప్రపంచానికి ఇంతవరకూ అందని సృష్టి రహస్యాన్ని ఛేదించటం కష్టమేం కాదు. గ్రహాంతర వాసులు భూమిని అంతం చేసే దిశగా ఆలోచిస్తున్నారన్న కోణంలోనే భూమిపై ప్రయోగాలన్నీ సాగుతున్నాయి. మనం ఇతర గ్రహాల గురించి ఎలా ఆలోచిస్తున్నామో.. ఇతర గ్రహాల్లో జీవరాశులు ఉంటే ఆ జీవరాశులు మన గురించి అలాగే ఆలోచించటంలో, భూమి మీదకు వచ్చి వెళ్లటంలో ఆశ్చర్యం లేదు. ఇప్పటివరకు గ్రహాంతర వాసులు భూమికి అన్యాయం చేసినట్లు కనిపించలేదు. ప్రాచీన కాలంలోనూ మనకు మేలు చేసినట్లే కథనాలు, చిత్రాలు ఉన్నాయి. అందుకేనేమో వారిని దేవతలన్నారు.. దేవతలే వారేమో.. అలాంటప్పుడు ఆ గ్రహాంతర వాసుల గురించి పాజిటివ్గా ఆలోచనలు చేస్తే అన్వేషణ సరైన దిశలో వెళ్తుంది. దేవతల గురించి ఇంతకాలంగా దాగి ఉన్న కీలకమైన రహస్యాన్ని ఛేదించటానికి దారి కనిపిస్తుంది.

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.